

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 13-05-2022 సంపుటి: 03 సంచిక: 236 పేజీలు: 4 వెల: రూ 3-00

## అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్‌పై సీఎం జగన్ సమీక్ష పూర్తి



తాడేపల్లి: అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్‌పై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు సీఎం జగన్‌కు ప్రాజెక్టుల పరోగతిని వివరాలను వివరించగా.. ఆయన పలు సూచనలు, కీలక ఆదేశాలు జారీ చేశారు. అగ్రి ఇన్‌ఫ్రా కింద సుమారు రూ.16,404.86 కోట్లతో చేపడుతున్న ప్రాజెక్టులు. వ్యవసాయ అనుబంధశాఖల్లో సుమారు 30 రకాల పనులు. వ్యవసాయ, అనుబంధరంగాల్లో మౌలికసదుపాయాల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన ముందుకు సాగాలన్న సీఎం జగన్. అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖలో మూడు రకాల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించిన అధికారులు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4,200 ప్రాంతాల్లో గోదాములు, కోల్డ్ రూములు, డ్రైయింగ్ ఫ్లాట్‌ఫాంలు నిర్మాణం. ఇప్పటికే తొలిదశలో 1165 గోదాములు, డ్రైయింగ్ ప్లాట్‌ఫాంల నిర్మాణానికి సంబంధించి స్థలాల ఎంపిక పూర్తైందన్న అధికారులు. 510 చోట్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్న అధికారులు. యుద్ధ ప్రాతిపదికన ఈ పనులు చేపట్టాలని, ఏడాదిలోగా మొత్తం నిర్మాణాలను పూర్తి చేయాలని, అందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకుని.. పనులు పూర్తి చేయాలన్న సీఎం జగన్ ఆదేశం.

ఆర్బీకేలను ఆంధ్రప్రదేశ్ మానసపుత్రికగా ప్రపంచ వేదికలమీదే మాట్లాడుకుంటున్న పరిస్థితి. ప్రతి గ్రామంలోనూ ఆర్బీకే స్థాయిలో ప్రైమరీ ప్రాససింగ్, డ్రైయింగ్ ప్రాట్‌ఫాంలు, గోదాములు, కోల్డ్‌రూంలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆర్బీకేలు సమర్ధవంతంగా పనిచేయాలంటే వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు చాలా కీలకమైనవి. ఏడాదిలోగా కచ్చితమైన ఫలితాలు కన్పించాలని అధికారుతో చెప్పిన సీఎం జగన్. ప్రతి ఆర్బీకేలో కూడా యంత్రసేవా పథకం ఉండాలని సీఎం జగన్ ఆదేశం. ప్రతి త్రైమాసికానికి లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఆమేరకు ప్రతి ఆర్బీకేకు, క్లస్టర్‌కు యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలని, అంతేకాకుండా రైతులకు వ్యక్తిగత సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాలపైనా దృష్టిపెట్టాలని సూచించారు. మొదటగా 2వేల డ్రోన్ యూనిట్లు.ఇందులో భాగంగా తొలుతగా 2వేల ఆర్బీకేల దృష్టి. అవసరమైన మేరకు డ్రోన్ యూనిట్లను పెంచుకోవాలన్న సీఎం జగన్. ప్రతి మండలంలో కనీసం 4 ఆర్బీకేలను లక్ష్యంగా చేసుకోవాలని, ఆర్బీకేల పరిధిలో డ్రోన్ పైలట్లను గుర్తించాలని సీఎం జగన్ సూచన. రైతుల్లో సైన్స్ గ్రాడ్యుయేషన్, ఇంటర్ సైన్స్ గ్రూపు చదువుకున్న రైతుల గుర్తింపు. అలాగే నానో యూరియా(ఫెర్టిలైజర్స్) వాడకంపై కూడా దృష్టిపెట్టాలన్న సీఎం జగన్. ఉద్యానపంటల ఉత్పత్తులు అధికంగా ఉన్నచోట డ్రై గోదాములు నిర్మాణానికి ప్రతిపాదనలు డిసెంబరు 22 నాటికి మొదలుపెట్టి మార్చి 2023 నాటికి పూర్తి చేస్తామని తెలిపిన అధికారులు. రెండు దశల్లో వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ ?అంబులెన్స్‌లు ప్రారంభించడానికి సన్నద్ధంగా ఉన్నామని అధికారులు వివరించారు.? తొలిదశ కింద 175 అంబులెన్స్‌లు, రెండో దశలో మరో 165 అంబులెన్స్‌లు సిద్ధమని అధికారులు చెప్పారు.

జగనన్న పాలవెల్లువ ప్రాజెక్టుపైనా సీఎం సమీక్ష..

త్వరలో అనకాపల్లి జిల్లాలో అమూల్ జగనన్న పాలవెల్లువ ప్రాజెక్టు ప్రారంభం.

అనకాపల్లి జిల్లాలో 191 గ్రామాల్లో ప్రారంభం కానున్న పాలసేకరణ.

మరో రెండు నెలల్లో ఇప్పటికే జగనన్న పాలవెల్లువ అమలవుతున్న జిల్లాలతో పాటు మొత్తం 1,282 గ్రామాల్లో ప్రారంభం కానున్న పాలసేకరణ.

ప్రాధాన్యతా క్రమంలో బీఎంసీ యూనిట్ల నిర్మాణం.

1184 బీఎంసీలు, 2388 ఏఎంసీల నిర్మాణం.

ప్రైవేటు డైరీలలో రైతులు మోసానికి గురికాకుండా చూడాలని సీఎం జగన్ సూచన.

పాలసేకరణ, వెన్న శాతం నిర్ధారణలో కచ్చితమైన ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, జగనన్న పాలవెల్లువ కార్యక్రమాల ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు లబ్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు.

## కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్‌గా రాజీవ్ కుమార్

కేంద్ర ఎన్నికల సంఘం తదుపరి ప్రధాన కమిషనర్‌గా రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రధాన కమిషనర్‌గా ఉన్న సుశీల్ చంద్ర పదవీ కాలం ఈ నెల 14 తో ముగియనుంది. ఈ నెల 15 న నూతన ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా రాజీవ్ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.రాజీవ్ కుమార్ నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఏప్రిల్ మాసంలో ఈ పదవికి ఆయన రాజీనామా చేశారు. చాలా సంవత్సరాలుగా ఆయన నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ముందు నుంచి కూడా కేంద్ర ప్రభుత్వంలో ఓ థింక్ ట్యాంక్‌గా ఉంటూ వస్తున్నారు.నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా అరవింద్ పణగారియా దిగిపోయిన తర్వాత రాజీవ్ కుమార్ ఈ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు పూణెలోని గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ అండ్ ఎకనామిక్స్‌కి ఛాన్సలర్‌గా ఉన్నారు. అలాగే లక్నోలోని గిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌కి బోర్డ్ ఆఫ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.



## 57 రాజ్యసభ స్థానాలకు జూన్ 10న ఎన్నికలు..

న్యూఢిల్లీ: 57 రాజ్యసభ స్థానాలకు జూన్ 10వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజున సాయంత్రం ఫలితాలను వెల్లడించనున్నారు. ఈనెల 24వ తేదీన రాజ్యసభ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. నామినేషన్‌కు చివరి గడువు మే 31వ తేదీ. మొత్తం 15 రాష్ట్రాల్లో ఉన్న 57 ఖాళీలకు ఈ ఎన్నికలు జరుగుతాయి. యూపీలో 11, ఏపీలో 4, రాజస్థాన్ లో 4, చత్తీస్‌ఘడ్ లో 4, జార్ఖండ్ లో 2, మహారాష్ట్రలో 6, తమిళనాడులో 6, పంజాబ్ లో 2, ఉత్తరాఖండ్ లో 2, బీహార్ లో 5, తెలంగాణలో 2, హర్యానాలో రెండు, మధ్యప్రదేశ్‌లో మూడు, ఒడిశాలో3 స్థానాలు ఉన్నాయి. తెలంగాణ నుంచి లక్ష్మీకాంత రావు, ధర్మపురి శ్రీనివాస్.. జూన్‌లో రిటైర్ కానున్నారు. ఆ ఇద్దరి స్థానాలకు జూన్ 10న ఎన్నికలు ఉంటాయి.




## ఏపీలో వ్యవస్థల పతనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది: చంద్రబాబు



కుప్పం: ఏపీలో వ్యవస్థల పతనం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కనీసం సీఎం కాన్వాయ్‌కి కార్లు కూడా పెట్టుకోలేని స్థితిలో రాష్ట్రం ఉండడం అవమానకరమన్నారు. బిల్లుల చెల్లింపులు జరపకపోతే అధికారులు కార్లు ఎలా ఏర్పాటు చేస్తారన్నారు. బిల్లులు రాక యజమానులు పడే బాధలకు ఎవరిది బాధ్యత? అని ప్రశ్నించారు. వ్యవస్థల నిర్వీర్యంతో అధికారులు, ఉద్యోగులు కూడా.. తీవ్ర ఒత్తిడికి లోనై తప్పులు చేసే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అసలు ప్రభుత్వం తెచ్చిన అప్పులు.. పెండింగ్‌లో ఉన్న బిల్లుల అంశంపై వాస్తవాలు వెల్లడించగలరా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

## 'చంద్రబాబు దుష్ప్రచారం.. చెప్పిన అబద్ధమే మళ్లీ మళ్లీ చెప్పి'

### ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

తాడేపల్లి: రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాగుతోందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అభివృద్ధి చేశాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు."గడప గడప"ను ప్రజలు అడ్డుకుంటున్నారంటూ.. టీడీపీ దుష్ప్రచారం చేస్తోంది. ప్రజల్లో టీడీపీ వాళ్లు కూడా ఉంటారు.. వారే ప్రశ్నించి వారే ప్రచారం చేసుకుంటున్నారు. అక్కడ జరిగేదంతా భూతద్దంలో చూపుతున్నారు. పథకాలు అందుతున్నాయా లేదా.. అని ప్రజలనే అడుగుతున్నాం. అందరూ సంతృప్తిగా ఉన్నారు. ఘన స్వాగతం పలుకుతున్నారు. రోజంతా ప్రజలతో మాట్లాడింది రికార్డ్ చేసుకోండి. మీకు దమ్ముంటే ఆ వీడియోలను విడుదల చేయండని" టీడీపీకి సజ్జల సవాల్ విసిరారు. దుష్ప్రచారం చేయడంలో చంద్రబాబు దిట్ట" అంటూ దుయ్యబట్టారు."విద్యుత్ మీటర్లను శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేస్తున్నాం. నువ్వు ఏనాడైనా ఉచిత విద్యుత్ ఇచ్చావా...?. ఇప్పుడు రైతులకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. మీటర్లు పెట్టడం వల్ల కేంద్రం నుంచి మనకు మేలు జరుగుతుంది. రైతులను ఇబ్బంది పెట్టలేదు. చెప్పిన అబద్ధం మళ్లీ మళ్లీ చెప్పి నమ్మించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.



## 'ఇదేం దిగజారుడు రాజకీయం బాబు.. అంతా హాస్యాస్పదం'

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తాడేపల్లి: చంద్రబాబు దిగజారి మాట్లాడుతున్నారని.. ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని.. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు.మీటర్లు బిగిస్తే ఉరితాడు అంటూ.. రైతులను రెచ్చగొట్టాలని చూస్తున్నారని మంత్రి మండిపడ్డారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు.. ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుప్పంలో చంద్రబాబు చేసింది ఏమీ లేదన్నారు. కరోనా సమయంలో కూడా పేదలకు మేలు జరిగిందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు.



## ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోండి

### ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, మే 12, (న్యూస్ పల్స్) ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు సమాచారం తెలియకపోవడం వల్ల, అవి కాగితానికే పరిమితమవుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. దీనివల్ల అర్హత లేని వ్యక్తులు ప్రయోజనం పొందుతారని ప్రధాని మోడీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని బరూచ్‌లో గురువారం జరిగిన ఉత్కర్ష్ సమరోహ్‌లో ప్రధాని మోడీ వర్చువల్ ద్వారా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని ప్రజలతో ప్రత్యేకంగా సంభాషించారు. ప్రజలంతా ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవాలని.. వాటిని వినియోగించుకోవాలని ప్రధాని సూచించారు. అధికారులు కూడా వీటి గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియకపోవడం వల్ల, అవి కాగితానికే పరిమితమవడం లేదా.. అర్హత లేని వారికి ప్రయోజనం చేకూరడం జరుగుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కీలక పథకాలను 100 శాతం లబ్ధిదారులకు చేరువైన సందర్భంగా ఉత్కర్ష్ కార్యక్రమం నిర్వహించారు. దీని ద్వారా అవసరమైన వారికి సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసింది. వితంతువులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాలకు సహాయం అందించేందుకు వీలుగా పథకాలు పూర్తి స్థాయిలో అందించాలనే లక్ష్యంతో భరూచ్ జిల్లా యంత్రాంగం ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31 వరకు 'ఉత్కర్ష్ ఇనిషియేటివ్' డ్రైవ్‌ను నిర్వహించింది.నాలుగు పథకాల్లో మొత్తం 12,854 మంది లబ్ధిదారులను గుర్తించారు. గంగా స్వరూప ఆర్థిక్ సహాయ యోజన, ఇందిరా గాంధీ వృద్ధ సహాయ యోజన, నిరాధార్ వృద్ధ్ ఆర్థిక సహాయ యోజన ? రాష్ట్ర కుటుంబ సహాయ యోజన పథకాలు ఉన్నాయి. డ్రైవ్ సమయంలో పథకాల ప్రయోజనాలను పొందని వారి గురించి సమాచారాన్ని సేకరించడానికి వీలుగా.. నియోజకవర్గం/తాలూకా వారీగా వాట్సప్ హెల్ప్‌లైన్ నంబర్‌లను ప్రకటించారు.జిల్లాలోని అన్ని గ్రామాలు మరియు మున్సిపాలిటీ ప్రాంతాల్లోని వార్డులలో ఉత్కర్ష్ శిబిరాలు నిర్వహించారు. ఇందులో అవసరమైన పత్రాలను అందించిన దరఖాస్తుదారులకు అక్కడికక్కడే ఆమోదం లభించింది. డ్రైవ్‌ను మరింత సులభతరం చేయడానికి ఉత్కర్ష్ సహాయకులకు ప్రోత్సాహకాలు కూడా అందించారు



కూతుళ్లను బాగా చదివించండి యాకూబ్

గుజరాత్‌లోని బరూచ్‌లో గురువారం జరిగిన ఉత్కర్ష్ సమరోహ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ ద్వారా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రజలతో ప్రత్యేకంగా సంభాషిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో దృష్టిలోపం ఉన్న యాకూబ్ పటేల్ అనే లబ్ధిదారుడితో ప్రధాని మోడీ ప్రత్యేకంగా సంభాషించారు. దృష్టిలోపం ఎందుకు వచ్చింది.. డాక్టర్లు ఏమన్నారు అంటూ ప్రధాని మోడీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీ కుమార్తెలను చదివిస్తున్నారా..? అని యాకూబ్‌ను ప్రధాని మోడీ అడిగారు. దానికి ఆయన సమాధానమిస్తూ.. తన ముగ్గురు కుమార్తెలు చదువుతున్నారని.. ఒకరు 12, మరొకరు 8, ఇంకొకరు 1వ తరగతి చదువుతున్నారన్నారు. వారిలో పెద్ద కుమార్తె డాక్టర్ కావాలని కోరుకుంటుందని యాకుబ్ తెలిపారు. అయితే.. పక్కన కూతురు ఉందా అంటూ అడిగారు.వెంటనే అక్కడ కూర్చున్న ఆలియాను.. వైద్య వృత్తిని కెరీర్‌గా ఎంచుకోవడానికి గల కారణం ఎంటని.. మోడీ ప్రశ్నించారు. దీనికి ఆమె సమాధానమిస్తూ.. "మా నాన్న దృష్టిలోపంతో బాధపడుతున్న సమస్య కారణంగా నేను డాక్టర్‌ని కావాలనుకుంటున్నాను" అంటూ చెప్పింది.

## నేను కూడా చేనేత కుటుంబ కోడలినే: మంత్రి ఆర్కే రోజా

విజయవాడ: ఆప్కో సమ్మర్ సారీ మేళాను ఏపీ పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర నలుమూలలా ఆప్కో షోరూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమ్మర్ శారీ మేళా ద్వారా మహిళలకు 30శాతం డిస్కౌంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు. చీరలు, చుడీదార్‌లు, పెళ్లి బట్టలు చాలా రకాల వెరైటీల్లో దొరుకుతున్నాయన్నారు. మహిళల మనసు దోచే విధంగా ఆప్కోలో చీరలు ఉన్నాయన్నారు. బయట షోరూమ్‌లకు ధీటుగా ఆప్కో షోరూమ్‌లు ఉన్నాయన్నారు.తాను కూడా చేనేత కుటుంబ కోడలినని మంత్రి రోజా తెలిపారు. నేతన్నలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అందిస్తున్నారని అన్నారు. చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి నేతన్నలకు సహకరిద్దామని ఆర్కే రోజా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ చిల్లపల్లి మోహనరావు, ఎండీ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



## గన్ కంటే ముందే వచ్చేస్తానన్న జగన్ ఎక్కడ? నారా లోకేశ్

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై టీడీపీ నేత, ఏపీ మాజీ మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. గన్ కంటే ముందే వచ్చేస్తానన్న సీఎం జగన్ ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఏపీలోని కడప జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనపై స్పందిస్తూ.. లోకేశ్ పై విధంగా పేర్కొన్నారు. గన్ కంటే ముందే వచ్చేస్తానంటూ సీఎం జగన్ డబ్బులు వెచ్చించి, ప్రచారాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. సొంత జిల్లాలోనే ఓ దళిత బాలికపై సామూహిక అత్యాచారం చేస్తే జగన్ ఎక్కడ? అంటూ లోకేశ్ ప్రశ్నించారు.వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఎస్సీ బాలికపై గత కొంత కాలంగా ఓ యువకుడితో సహా 10 మంది ఇతరులు పదే పదే అత్యాచారం చేసినట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

శుక్రవారం 13-05-2022

## ఆర్థిక సంక్షోభంలో సౌత్ ఏషియా

మన పక్కనున్న దేశాలలో సమస్యల పరిష్కారానికి వివిధ దేశాల సహకారం తీసుకోవాలి. లేకపోతే మనకు భవిష్యత్తులో అనేక సమస్యలు ఈ దేశాల వలన సంభవిస్తాయి. ఆ దేశాలలో ముఖ్యంగా రాజకీయ స్థిరత్వం ఏర్పాటు చేయాలి. విపరీతమైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి. విదేశీ అప్పులు ఆచితూచి చేయాలి. మత సామరస్యానికి పెద్దపీట వేయాలి. విద్య, వైద్యం ప్రభుత్వం ఆధీనంలో ఉండాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. స్థానిక ఉత్పత్తులు ప్రోత్సహించాలి. 'లోకల్ టు గ్లోబల్' అనే సిద్ధాంతం అమలు చేయాలి. పొరుగు దేశాలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలి. ఈ విధంగా దక్షిణ ఆసియా దేశాలు సంక్షోభాల నుంచి బయటపడాలి. ఇదే శాశ్వత పరిష్కారం. చాలా ప్రశాంతంగా ఉండే దక్షిణాసియా దేశాలు ఇటీవలి కాలంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రశాంతత లేకుండా, చివరికి ఆహారం దొరకని కడు దయనీయ స్థితికి చేరుకుంటున్నాయి. ఇతరుల సహాయం కోసం ఎదురుచూడటం సర్వ సాధారణంగా మారింది. ఈ పరిణామాలు ఆయా దేశాలకే కాకుండా, పొరుగు దేశాలకు తలపోటు అవుతున్నాయి. ముఖ్యంగా గత ఆగస్టు నెలలో అఫ్ఘనిస్తాన్‌లో తిరిగి తాలిబన్ పరిపాలన రావడంతో ఆ దేశంలో మానవ హక్కులు మంటగలిసాయి. సుమారు ఐదు మిలియన్ల మంది ప్రజలు దేశాన్ని విడిచి సమీప దేశాలకు వెళ్లిపోయారు. మరో పొరుగు దేశం పాకిస్తాన్‌లో ఎప్పుడు ఎవరి పాలన ఉంటుందో అర్థం కాని పరిస్థితి. ఇటీవలనే ఆ దేశ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌ను పదవి నుంచి తొలగించారు. అక్కడ సైన్యం చెప్పినట్టు ప్రభుత్వాలు పాలన చేయాలి. దశాబ్దాలుగా పాకిస్తాన్‌లో నడుస్తున్న చరిత్ర ఇది. ఒకపక్క బెలూచీ జాతీయవాదులు, మరోపక్క తాలిబన్ తీవ్రవాదులు, ఇతర గ్రూపులు సమస్యలతో ఆర్థికంగా బాగా దిగజారుతూ కాలం గడుపుతున్న దేశం అది. రాజకీయ అస్థిరత్వం, ఉగ్రవాదులకు అడ్డాగా పాకిస్తాన్ ఉండంతో మనలాంటి దేశాలకు సైనిక భారం ఎక్కువ అవుతూ ఇబ్బంది పడుతున్నాం. తరచూ వందల సంఖ్యలో సైనికులను కోల్పోతున్నాం. పుల్వామా దాడి అందుకు ఉదాహరణ. శ్రీలంక పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది. ఆర్థిక సంక్షోభం నుంచి ఆ దేశం తేరుకోలేకపోతోంది. ప్రధాని మహిందా రాజపక్సే రాజీనామా చేశారు. ఘర్షణలు సమసిపోవడం లేదు. ఆందోళనలు ఊపందుకుంటున్నాయి. విపక్ష నేత సజిత్ ప్రేమదాస మీద దాడి జరిగింది. 2019లో ఐసిస్ ఉగ్రవాదుల దాడిలో సుమారు 269 అమాయకుల ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రపంచం నివ్వెరపోయింది. శ్రీలంక ప్రధాన ఆదాయం పర్యాటకమే. ఈ ఉగ్రదాడి, కరోనా కారణంగా వారి ఆదాయానికి గండి పడింది. దీంతో పాటు అక్కడ జరిగిన ఎన్నికలలో ఆదాయానికి మించిన హామీలు ఇవ్వడం, ఇతర దేశాల నుంచి అప్పు తీసుకోవడం వలన ప్రపంచ పటంలో లంక నిజంగా కన్నీరు బొట్టు వలె కనపడుతున్నది. నిరుద్యోగం ఎక్కువైంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకాయి. ఒక కోడిగుడ్డు 40 రూపాయలు, లీటర్ పెట్రోల్ 350 రూపాయలకు చేరుకుంది. చివరికి విద్యార్థులకు పరీక్షలు రాయడానికి తెల్ల కాగితాలు కొనలేని స్థితికి ప్రభుత్వం దిగజారింది. సుమారు 51 బిలియన్ల అమెరికన్ డాలర్ల విదేశీ అప్పులు చెల్లించాల్సి ఉంది. కట్టలేమని శ్రీలంక ప్రభుత్వం ప్రకటించింది. సామాన్య ప్రజలు రోడ్ల మీదకు చేరి అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. అధ్యక్షుడు రాజపక్సె రాజీనామా చేశారు. నేపాల్ కూడా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయింది. విదేశీ మారక ద్రవ్యం తరిగిపోయింది. మయన్మార్ సైనిక పాలనలో దశాబ్దాలుగా కునారిల్లుతోంది. అంతర్గత కలహాలతో అట్టుడుకుతోంది. ఇలా పలు దక్షిణాసియా దేశాలు, మన భారతదేశ పొరుగు దేశాలు రాజకీయ, ఆర్థిక , సామాజిక సమస్యలతో తల్లడిల్లుతున్నాయి. మనకు కూడా భారంగా మారుతున్నాయి. పక్క దేశాలలో ఇబ్బంది పడుతున్న ప్రజలు 'శరణార్థులుగా మన దేశంలోకి ప్రవేశిస్తున్నారు. అశాంతికి దారులు వేస్తున్నారు. సామాజిక, ఆర్థిక రాజకీయ సమస్యలకు వారే కారణం అవుతున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఇండియా జాగ్రత్తగా ఉండాలి. మన పక్కనున్న దేశాలలో సుస్థిర పాలనకు ప్రయత్నాలు చేయాలి. అప్పుడే మన దేశంపై భారం తగ్గుతుంది. లేకపోతే ఈ ప్రాంతం అంతా భవిష్యత్తులో వివిధ రకాల అశాంతికి, సమస్యలకు నిలయంగా మారుతుంది' అని అంతర్జాతీయ వ్యవహారాలు పరిశీలన చేసే ప్రొఫెసర్ ధనుంజయ త్రిపాఠి అన్నారు. ఇప్పటికే మన దేశం మానవతా దృక్పథంతో అఫ్ఘనిస్తాన్, శ్రీలంకకు ఆహార ధాన్యాలు పంపింది. పెట్రోల్, డీజిల్ పంపింది. ఉక్రెయిన్ ప్రజలకు వివిధ రకాల మందులు, వస్తువులు అందించింది. మానవతా దృక్పథంతో సహాయం చేయాలని చూసినా, మనకు ఆర్థిక భారమే కదా! కావున మన పక్కనున్న దేశాలలో సమస్యల పరిష్కారానికి వివిధ దేశాల సహకారం తీసుకోవాలి. లేకపోతే మనకు భవిష్యత్తులో అనేక సమస్యలు ఈ దేశాల వలన సంభవిస్తాయి. ఆ దేశాలలో ముఖ్యంగా రాజకీయ స్థిరత్వం ఏర్పాటు చేయాలి. విపరీతమైన ఉచిత పథకాలకు స్వస్తి పలకాలి. విదేశీ అప్పులు ఆచితూచి చేయాలి. మత సామరస్యానికి పెద్దపీట వేయాలి. విద్య, వైద్యం ప్రభుత్వం ఆధీనంలో ఉండాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. స్థానిక ఉత్పత్తులు ప్రోత్సహించాలి. 'లోకల్ టు గ్లోబల్' అనే సిద్ధాంతం అమలు చేయాలి. పొరుగు దేశాలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలి. ఈ విధంగా దక్షిణ ఆసియా దేశాలు సంక్షోభాల నుంచి బయటపడాలి. ఇదే శాశ్వత పరిష్కారం

# వివేకా హత్య కేసులో సీబీఐకే బెదిరింపులు

కడప మే 12, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సొంత బాబాయి.. మాజీ మంత్రి వైయస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ఓ కొలిక్కి వస్తున్న తరుణంలో.. ఊహించని ట్విస్టులు చేటు చేసుకొంటున్నాయి. దీంతో సీబీఐ అధికారులు తలలు పట్టుకొంటున్నారని సమాచారం. వివేకా హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులకు దుండగుల నుంచి బెదిరింపులు వస్తున్నట్లు తెలుస్తోంది. కడపలో సీబీఐ అధికారులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఆగంతకులు అడ్డగించి.. ఈ నగరం నుంచి వెళ్లిపోవాలని వారిని హెచ్చరిస్తున్నారట. తమకు వస్తున్న బెదిరింపులపై సీబీఐ అధికారులతోపాటు కారు డ్రైవర్.. స్థానిక చిన్న చౌక్ పోలీసులను ఆశ్రయించి.. ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని సమాచారం. అందులోభాగంగా.. సీబీఐ అధికారులు, కారు డ్రైవర్‌ను బెదిరించిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు.. అందులోభాగంగా సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వివేకా హత్య కేసు.. దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు గత కొంత కాలంగా సైలెంట్‌గా ఉంటున్నారు. అయితే గతంలో వారిని గెస్ట్ హౌస్ ఖాళీ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. అలాగే మరోసారి.. సీబీఐ అదికారులపై ఆగంతకుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో సీబీఐ అదికారులు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. అయితే తాజాగా సీబీఐ అధికారులకే బెదిరింపులు రావడంతో.. కడప జిల్లాలో కలకలం రేగుతోంది. అయితే ఇదంతా అధికార పార్టీకి చెందిన వారే చేస్తున్నారని.. అందుకే పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఓ టాక్ అయితే తాజాగా జిల్లాలో జోరుగా వైరల్ అవుతోంది. 2019, మార్చి 15న వైయస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. తొలుత వివేకాది గుండెపోటు అంటూ నాటి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రకటించారు. అలాగే సీఎం జగన్‌కు చెందినసొంత మీడియాలో సైతం ఇదే ప్రచారం చేశారు. ఆ తర్వాత వైయస్ వివేకా గుండెపోటుతో మరణించలేదని.. ఆయన దారుణ హత్యకు గురయ్యారంటూ మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ క్రమంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం.. ఈ హత్యపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైయస్ జగన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో.. తన తండ్రి హత్య కేసులో అసలు దోషులు ఎవరో తెలుస్తోందని వైయస్ వివేకా కుమార్తె వైయస్ సునీత వెయ్యి కళ్లతో ఎదురు చూశారు. కానీ తన సోదరుడు సీఎం జగన్ ప్రభుత్వంలో సైతం తమకు న్యాయం జరగడం లేదనే విషయం ఆమె మెల్లగా అర్థమైంది. ఈ నేపథ్యంలో వైయస్ వివేకా భార్యతోపాటు ఆయన కుమార్తె వైయస్ సునీత.. హైకోర్టులో ఫిటిషన్ దాఖలు చేసి.. ఈ హత్య కేసును సీబీఐకు అప్పగించాలని అభ్యర్థించారు. దీంతో ఈ హత్య కేసును సీబీఐకు అప్పగిస్తూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత వివేకా హత్య కేసు.. సీబీఐ దర్యాప్తు చేపట్టినా... విచారణ అంతగా ముందుకు సాగలేదన్నది మాత్రం సుస్పష్టమే. అయితే.. వైయస్ వివేకానందరెడ్డి మాజీ కార్ డ్రైవర్ దస్తగిరి అప్రూవర్‌గా మారి.. ఈ హత్య కేసులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరు అన్నది.. అలాగే వివేకా హత్యకు సూపారీ ఎంత ఇచ్చారు.. తదితర అంశాలన్నీ సీబీఐకి దస్తాగిరి క్లియర్ కట్‌గా పూసగుచ్చినట్లు చెప్పేశారు. దాంతో తెలుగు ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడారు. ఈ నేపథ్యంలో ఈ హత్య కేసులో నిందితులు అప్రమత్తమై.. ఈ కేసును పక్క తోవ పట్టించేందుకు పలు పథకాలు తెరపైకి తీసుకొచ్చారు. ఆ క్రమంలో వివేకా హత్యను దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపైనే కాకుండా.. వైయస్ వివేకా కుమార్తె సునీత ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిలపై పోలీసు ఉన్నతాధికారుల ఫిర్యాదు చేశారు. దీంతో అసలు ఈ కేసులో ఏం జరుగుతుందో అర్థంకాక ప్రజలంతా తీవ్ర కన్ఫ్యూజ్‌కు గురయ్యారు. ఆ సమయంలో సీబీఐ అదికారులు సైతం ఢిల్లీకి వెళ్లిపోయి.. ఈ హత్య కేసులో విచారణ జరుగుతున్న తీరు.. చోటు చేసుకుంటున్న పరిణామాలను సైతం సదరు సీబీఐ అధికారులు.. ఆ కార్యాలయంలోని ఉన్నతాధికారులకు విపులీకరించారు. దాంతో ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులకు వారు అభయ హస్తం అందించారని సమాచారం. దీంతో సదరు సీబీఐ అధికారులు.. మళ్లీ కడపకు వచ్చి.. వివేకా హత్య కేసు దర్యాప్తును షూరు చేశారు. ఆ క్రమంలో ఢిల్లీ నుంచి నేరుగా సీబీఐ ఉన్నతాధికారి.. కడప సెంట్రల్ జైలు అతిథి గృహంలో మకాం వేసి.. దర్యాప్తు చేశారు.

అయితే అదే సమయంలో వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డితోపాటు ఆయన తండ్రి భాస్కరరెడ్డికి కూడా నోటిసులు జారీ చేశారని.. కానీ వాటిని వారు తీసుకునేందుకు నిరాకరించినట్లు నాడు మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలన్నీ అందరికీ తెలిసినవే. అయితే తాజాగా వివేకా హత్య కేసులో దర్యాప్తు తుది దశకు చేరుకోనుందని భావిస్తున్న తరుణంలో... సీబీఐ అధికారులకు ఆగంతకుల నుంచి బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు.. ఈ కేసు వివేకా కుమార్తె వైయస్ సునీత నివాసం వద్ద కూడా దుండగులు రెక్కీ నిర్వహించారని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. దీంతో స్థానికంగా కలకలం రేగుతోంది. అయితే ఇలాంటి తరుణంలో వైయస్ వివేకా హత్య కేసులో దోషులను పట్టుకునేందుకు సీబీఐకు మరింత కాలం పట్టవచ్చునని ఓ టాక్ అయితే కడప జిల్లాలో వైరల్ అవుతోంది.

# కార్పొరేట్ సంస్థలపై నీలినీడలు

విజయవాడ, మే 12, ఒకటి.. రెండూ.. మూడూ.. అన్ని ర్యాంకులూ మావే. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభంజనం.. ఇంటర్ ఫలితాల్లో నెంబర్ వన్ మేమే.. అంటూ ఊదరగొట్టే కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలపై ఒక్కసారిగా నీలినీడలు కమ్ముకొచ్చాయి. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న విద్యాసంస్థల అధినేత క్వశ్చన్ పేపర్ల లీకేజీ వ్యవహారంలో అరెస్టు కావడం పెను సంచలనంగా మారింది. విద్యను వ్యాపారంగా మార్చేసిన కార్పొరేట్ మాయాజాలం ర్యాంకుల కోసం బరితెగిస్తోందా? ఎలాగైనా.. ఏం చేసైనా ర్యాంకుల పంట పండించడం.. వాటిని చూపించి కాసులు పిండుకోవడమే పనిగా పెట్టుకుందా? అనే అనుమానాలను రేకెత్తిస్తోంది. వేల కోట్లకు పడగలెత్తిన విద్యావ్యాపార సామ్రాజ్యపు మూలాలపైనా సందేహాలను లేవనెత్తుతోంది. నారాయణ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి నారాయణ అరెస్టు మరిన్ని ప్రశ్నలను సంధిస్తోంది. దశాబ్దాల పాటు విద్యా రంగంలో ఓ వెలుగు వెలిగిన నారాయణ, చైతన్య సంస్థలపై ఏకంగా ప్రభుత్వాధినేతలే ఆరోపణలు చేయడం.. విచారణలోనూ సంచలన నిజాలు తెలిశాయని పోలీసులు సైతం వెల్లడించడం కొత్త చర్చకు దారితీస్తోంది. ఇది ఇప్పటి నుంచి జరుగుతున్నది కాదని.. ఎప్పటి నుంచో ఈ మాల్ ప్రాక్టీస్‌ను వ్యవస్థీకృతం చేశారనే నిజాలు విద్యావ్యవస్థనే ప్రమాదంలోకి నెట్టేసేలా ఉన్నాయి. ర్యాంకుల కోసం అడ్డదారులు తొక్కుతూ.. పరమపదసోపానంలో నిచ్చెనలు ఎక్కుతూ ఎదిగిన వైనంపై ఒక్కసారిగా అనుమానపు మేఘాలు అలుముకున్నాయి. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా అంత సీరియస్ కాకుండానే సమసిపోయాయి. ఒకే రోజు వచ్చే పేపర్ యాడ్స్‌లో ఫలానా ర్యాంకర్ మా విద్యార్థేనంటూ సంస్థలు పోటీపడి మరీ ప్రకటనలిచ్చిన ఘటనలు చాలానే చూశాం. రెండు, మూడు దశాబ్దాలుగా విద్యా వ్యవస్థలో మకుటం లేని మహారాజులా ఎదుగుతూ వచ్చిన ఆ రెండు కార్పొరేట్ సంస్థలూ అందుకు అతీతమేమీ కాదు. ఒకే ర్యాంకర్ మా వాడేనంటూ ప్రకటనలిచ్చి జబ్బలు చరుచుకున్న సందర్భాలున్నాయి. ఆ తర్వాత పోటీ పడడం ఎందుకు అనుకున్నారో.. లేక ఇద్దరూ కలిస్తే మంచిదనుకున్నారో కానీ ఒక్కటైపోయారు. ఒక హైబ్రిడ్ సంస్థను సృష్టించారు. కానీ ఆ తర్వాత కొన్నేళ్లకే విభేదాలొచ్చి రచ్చకెక్కారు. అధికార బలమున్న అధినేత ఆధిపత్యం భరించలేకపోతున్నామంటూ భాగస్వామ్య సంస్థ ప్రతినిధులు బహిరంగంగానే అసహనం వెళ్లగక్కారు. కానీ కార్పొరేట్ మూలాల జోలికి మాత్రం వెళ్లలేదని తాజా ఎపిసోడ్‌తో అవగతమవుతోంది. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి అత్యున్నత చదువులను ఎరగా వేసి ఒకటే రుబ్బుడు కార్యక్రమం అలవాటు చేసిన కార్పొరేట్ దందా.. తమ చదువుల నాణ్యతలో డొల్లతనాన్ని కూడా పసిగట్టేసిందనే చెప్పాలి. ర్యాంకులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పనికిరావని అనుకున్నారేమో వాటిని పక్కన పడేసినట్లు అర్థమవుతోంది. కేవలం మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై ఫోకస్ ఉంటుందని.. మిగిలిన వాటిలో విద్యార్థులు వెనకబడతారని ఇలాంటి ప్రాక్టీస్ ఎంచుకున్నారని తేలడం నిజంగా విద్యావ్యవస్థకు పెనుప్రమాదమే. మాతృభాషను కూడా చూసి రాసుకోవాల్సిన పరిస్థితుల్లోకి నెట్టేస్తున్న ఈ దారుణాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియట్లేదు మరి!!

# మయన్మార్ నుంచి... సిక్కోలుకు

శ్రీకాకుళం, మే 13, శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం ఎం.సున్నాపల్లి సముద్ర తీరానికి అసని తుపానులో కొట్టొకొచ్చిన బంగారు రథం మిస్టరీ దాదాపు వీడిపోయింది. బంగారు రంగుతో మెరిసిపోతున్న ఈ స్వర్ణ రథాన్ని స్థానికులు తాళ్లతో లాగి ఒడ్డుకు చేర్చారు. దేవుని ఊరేగింపులో ఉపయోగించే వాహనం మాదిరిగా అది కనిపిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అసని తుపానుకు సముద్రంలో కొట్టుకు వచ్చిన ఆ వింత వాహనం బంగారు రంగుతో మెరిసిపోతోంది. దాన్ని నిజంగా బంగారు రథమే అని స్థానికులు కొందరు భావించారు. దాన్ని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. దాంతో పోలీసులు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఈ బంగారు రథం మయన్మార్ నుంచి కొట్టుకువచ్చినట్టు క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు నిర్ధారణకు వచ్చారు. మయన్మార్ లో సన్యాసం తీసుకునే యువతీ యువకులను ప్రత్యేకంగా తయారుచేసిన వాహనాల్లో భారీ ఎత్తున ఊరేగిస్తారు. శ్రీకాకుళం జిల్లాలో సముద్రతీరానికి కొట్టుకు వచ్చిన మాహనం కూడా అలాగే కనిపిస్తోందని అధికారులు చెప్పారు. అయితే.. ఈ వాహనం పెద్దగా కనిపిస్తోందన్నారు. ఊరేగింపు తర్వాత ఈ వాహనాన్ని సముద్రంలో నిమజ్జనం చేసి ఉంటారని, అది పూర్తిగా నిమజ్జనం కాకపోవడంతో తుపాను తీవ్రతకు ఇలా కొట్టుకుని వచ్చి ఉంటుందంటున్నారు. ఈ వాహనంపై ఈ ఏడాది జనవరి 16 తేదీ ఉండడంతో నాలుగు నెలల క్రితమే దీన్ని తయారుచేసి ఉంటారని, అందుకే కొత్తగా ధగధగలాడుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ బంగారు రథం రూపురేఖలు, డిజైన్లు అన్నీ కూడా బౌద్ధమతం థీమ్ లో ఉందని వారు అన్నారు. కాగా.. మూడు నెలల క్రితమే నెల్లూరు జిల్లా తీరప్రాంతానికి ఇలాంటి వాహనం ఒకటి కొట్టుకొచ్చింది. అయితే.. అది చాలా పాతగా కనిపించింది. ఆ వాహనంలో బుద్ధుని ప్రతిమ, చిత్రంతో, శివలింగం కూడా ఉన్నాయి.

# పేర్ని నానికి ఫ్రస్టేషన్



విజయవాడ, మే 12 పేర్ని నాని.. తెలుగు ప్రజలకు పరిచయం అక్కర్లేని పేరు. గతంలో ఏమో కానీ.. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆయన తొలి కేబినెట్‌లో మంత్రిగా ఈ పేర్ని నాని గారి హావా కొట్టొచ్చనట్లు కనబడేదని.. ఫ్యాన్ పార్టీలోని నాయకులు ఏమో కానీ.. సినీ పెద్దలు మాత్రం టాలీవుడ్ సాక్షిగా గట్టిగానే చెప్పుకొనేవారు. అయితే పేర్ని నాని తాజాగా మాజీ మంత్రిగా మారారు. ఈ నేపథ్యంలో ఆయన ఫ్రెస్ట్రేటషన్ పీక్స్ వెళ్లిపోయిందనే ఓ టాక్ అయితే బందరు నియోజకవర్గంలో జోరుగా సర్క్యులేట్ అవుతోంది. మంత్రిగా ఓ వెలుగు వెలిగిన ఈ మాజీ మంత్రిగారిని తాజాగా నగర ప్రజలు అంతాగా లెక్క చేయడం లేదట. ఈయన గారు నగర వీధుల్లోకి వస్తే.. జనం లైట్‌గా తీసుకుని చూసి చూడనట్లు పక్క నుంచి వెళ్లిపోతున్నారట. అంతేకాదు.. ఇటీవల కేంద్ర మంత్రి పోర్టు అంశంపై.. బందరు వస్తే.. రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజుతో ఆయన మాట్లాడుతుండగా.. ఈ మాజీ మంత్రిగారు.. అల్లంత దూరంలో ఉండిపోయిన ఓ చిత్ర రాజం ఇటీవల సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేసింది. మరోవైపు.. బందరు నగరంలో జనసమర్ధంగా ఉండే ఓ ప్రాంతంలో ఇటీవల ఓ షాపును.. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధ ముఖ్య అతిథిగా హాజరై.. ప్రారంభించారు. కానీ ఈ కార్యక్రమానికీ ఈ తాజాగా మాజీ అయిన మంత్రిగారిని పిలవలేదట. దీంతో ఈ మాజీ అమాత్యుల వారికి కోపం నషాళానికి అంటిందట. అంతే.. ఈ మాజీ సార్ వాడు.. వెంటనే రంగంలోకి దిగి.. సదరు కూడలిలో బారికెడ్లు పెట్టించారట. దీంతో సెంటర్‌లో ఈ బారికెడ్లు ఎందుకు రోడ్డుకు అడ్డంగా ప్రత్యక్షం అయినాయో.. అర్థం కాక.. సదరు నగర వాసులు అయోమయం జగన్నాథం స్థితిలోకి సర్రున జారిపోయారట. అసలు ఏం జరిగిందంటూ అక్కడి వారిని జనం ఆరా తీయగా.. ఇదంతా మాజీ మంత్రివర్యులు గారి తాజా తాజా పెతాపం అంటూ గుసగుసలు మొదలైనాయట. జగన్ కేబినెట్‌లో పేర్ని నాని... రవాణా, సినీమాటోగ్రఫీ, సమాచారం పౌర సంబంధాలు శాఖల మంత్రిగా పని చేసినా.. సినీమాటోగ్రఫీ మంత్రిగా ఆయన ధగధగా వెలిగిపోయారన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాగే గతంలో మంత్రిగా పేర్ని నాని ఎప్పుడు ప్రెస్ మీట్ పెట్టినా..చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై ఓ రెంజ్‌లో చెలరేగిపోయేవారన్న సంగతి అందరికీ తెలిసిందే. మరో వైపు జగన్ కేబినెట్ నుంచి తప్పుకుని మాజీ మంత్రులు అయిన కొడాలి నాని, కన్నబాబు, అనిల్ కుమార్ యాదవ్, అవంతి తదితరులంతా ముక్కున వేలేసుకుని స్కూల్ స్టూడెంట్‌లా సైలెంట్ అయిపోయారన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ మంత్రి పదవి నుంచి తప్పుకున్న తర్వాత కూడా ఈ పేర్ని నాని మాత్రం ఇంకా మంత్రిగానే కొనసాగుతున్నట్లు వ్యవహరిస్తున్నారని ఓ టాక్ అయితే నియోజకవర్గ ప్రజలు బలంగా ఉంది. తాజాగా మాజీలు అయిన మంత్రులు కొడాలి, కన్నబాబు, అవంతి, అనిల్ కుమార్ యాదవులు ప్రెస్ మీట్లు పెట్టడం లేదు. కానీ పేర్ని నాని ప్రెస్ మీట్ పెట్టి.. మంత్రిగారి హోదాలో మాట్లాడినట్లు మాట్లాడడం. జనానికి అంతగా రుచించడం లేదట. మరోవైపు వంగవీటి రాధ, కొడాలి నానిలు మంచి దోస్తులే. కానీ వంగవీటి రాధకు పేర్ని నానికి మద్య గ్యాప్ ఉందని సమాచారం. ఆ క్రమంలోనే వంగవీటి రాధ.. తన నియోజకవర్గంలోకి వచ్చి.. షాపు ఒపెనింగ్ చేసి వెళ్లిపోవడాన్ని ఈ మాజీ మంత్రి వర్యులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలుస్తోంది. ఏదీ ఏమైనా మాజీలు అయిన సహచరులంతా చాలా కామ్‌గా ఉంటే.. ఈ పేర్ని నాని మాత్రం ఇలా రగిలిపోవడం ఎందుకు అని ప్రశ్న బందరులోని ఫ్యాన్ పార్టీ నేతల్లోని ఓ వర్గంలో ఉత్పన్నమైందట. అదీ ఫ్రస్ట్రేషనా లేక మళ్లీ మంత్రి పదవి కోసమేనా? అనే సందిగ్ధంలోకి ఆయన అనుచరులంతా లట్టుక్కున జారీపోయారట

# సోమూ పోయో... కన్నా వచ్చె

గుంటూరు, మే 13, ఏపీ బీజేపీలో సీన్ మారిపోతోంది. ఏపీ బీజేపీ అధ్యక్షునిగా ఆయనను అధికారికంగా తొలగించకపోయినా ఇక ఆయన పాత్రను నామమాత్రం చేయాలన్న సూచనలు ఢిల్లీ నుంచి ఏపీ బీజేపీ నేతలకు అందినట్లుగా తెలుస్తోంది. కన్నా లక్ష్మినారాయణ ఒక్క సారిగా యాక్టివ్ అయ్యారు. కన్నా ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. ఏపీ నుంచి ఆయన ఒక్కరే ఢిల్లీ స్థాయి నేత. ఆయన తాజాగా తన బృందాన్ని తీసుకుని గవర్నర్‌ను కలిశారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ మతం, హిందూ దేవాలయాలపై దాడులు జరిగినా ఎక్కడా పోలీస్ యాక్షన్ తీసుకోలేదని, రాష్ట్రంలో మతమార్పిడులు విచ్చల విడిగా జరుగుతున్నాయి అని ఫిర్యాదు చేశారు. నెల్లూరులో హనుమాన్ జయంతి శోభాయాత్రపై అటాక్ చేశారు ,ఆత్మకూరు లో హిందూ ఏరియాలో మసీదు కడుతున్నారని అడిగితే వారి పై దాడి చేశారు ,తెనాలి లో హిందూ మహిళని వేదిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు,శ్రీశైలం లో అన్యమత మతస్తులు అత్యధికంగా దుకాణాలు, ఇతరత్రా కలిగి ఉన్నారని నిరూపించినా చర్యలు లేవని బీజేపి నాయకులు తెలిపారు. సాధారణంగా గవర్నర్‌ను కలవాలంటే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి నేతృత్వంలో వెళ్తారు. ఈ సారి సోము వీర్రాజును పక్కన పెట్టి కన్నా నేతృత్వంలో కలిశారు. సోము వీర్రాజు తీరుపై బీజేపీ హైకమాండ్ ఆగ్రహంతో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. గతంలో అమిత్ షా వచ్చినప్పుడు పొత్తులపై మాట్లాడవద్దని స్పష్టమైన సూచనలు చేశారు. అయినా సోము వీర్రాజు జిల్లాలు తిరుగుతూ పొత్తులపై రకరకాల కామెంట్లు చేస్తూ? తాను కూడా సీన్‌లో ఉన్నానని మీడియా దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారు. పొత్తులపై మాట్లాడిందే తప్పు.. వేరేది ఏం మాట్లాడినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయన తీరుపై ఇప్పటికే బీజేపీలోని ఓవర్గం రగిలిపోతోంది. వైసీపీ కోసం ఆయన పని చేస్తున్నట్లుగా ఉందని ఆరోపిస్తున్నారు. పొత్తుల విషయంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లుగా క్లారిటీకి వచ్చి ఆయనకు బదులుగా కన్నాను యాక్టివ్ అవమని సూచించినట్లుగా బీజేపీలోనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి బయట పొత్తుల సంగతేమిటో కానీ ఏపీ బీజేపీలో మాత్రం జరగరానిదేదో జరుగుతోందన్న అభిప్రాయం మాత్రం ఎక్కువగా వినిపిస్తోంది.

# ఏర్పేడు లో గడప గడపకు మన ప్రభుత్వం

తిరుపతి తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పండుగలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం పల్లం, పల్లంపేట, పల్లం గొల్లపల్లిలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడపగడపకు వెళ్తున్నప్పుడు సీఎం జగన్ మోహన్ రెడ్డిపై ప్రజలు చూపిస్తున్న అభిమానం చూస్తుంటే తనకు ఎనలేని సంతోషం కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి ప్రతి ఒక కుటుంబంలో సంక్షేమ పథకం ద్వారా సంతోషాన్ని నింపుతున్నారని కొనియాడారు.

# ఆళ్లగడ్డ లో భారీ వర్షం...

## నేలకొరిగిన పంటలు

ఆళ్లగడ్డ ఆళ్లగడ్డ పరిధిలో గురువారం భారీ వర్షం కురిసింది.. బలమైన ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.. దీంతో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న వంటి పంటలు నేలకొరిగాయి.. భారీ వర్షం, ఈదురు గాలులు ,పిడుగుల శబ్దంతో ప్రజలు రాత్రంతా తమ ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. నియోజకవర్గంలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. అసని తుఫాన్ రైతన్నల ఆశలకు ఆశనిపాతంగా మారింది. ముఖ్యంగా చేతికొచ్చిన పంటలను చిద్రం చేసింది. రహదారులపై ఆరబోసిన పంటలు దెబ్బతింటున్నాయి.

# మేకపాటి విక్రమ్... పూలబాటేనా

నెల్లూరు, మే 13, మేకపాటి విక్రమ్ రెడ్డి.. ఇంతకు ముందెన్నడూ రాజకీయంగా వినపడని పేరు.. విక్రమ్ గతంలో ఎప్పుడూ కనపడని బొమ్మ.. అయితే.. ఆ పేరు తండ్రి, అన్నలా మారుమోగుతుందా.. మేకపాటి వారసుడు అన్నంత ఘనంగా బొమ్మ పలికిస్తుందా.. అనే ఊగిసలాట అందరి మదిలో కనిపిస్తోంది. మేకపాటి కుటుంబ వారసుడిగా విక్రమ్ రెడ్డి రాణిస్తారా.. లేదా.. ?!మేకపాటి గౌతమ్ రెడ్డి ఆకస్మిక మరణం తరువాత ఆ కుటుంబంలో కొంత రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్రెడ్డి వారసుడు ఎవరనేది నిన్నటి వరకు క్లారిటీ లేక అటు అత్మకూరు నియోజకవర్గం ప్రజల్లో.. ఇటు వైసీపీ కార్యకర్తల్లో కొంత నైరాశ్యం కనబడింది. కొంత కాలం క్రితం మేకపాటి గౌతమ్ రెడ్డి సతీమణి శ్రీకీర్తిరెడ్డి రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరిగింది. కానీ దాన్ని కొట్టిపారేసేందుకు మేకపాటి రాజమోహన్ రెడ్డి తన రెండో కుమారుడు విక్రమ్ వస్తున్నాడని ప్రకటించారు. అయినా అది జరుగుతుంతో లేదో అని ఎక్కడో కొంత అనుమానం కార్యకర్తల్లో కలిగింది. ఈ అనుమానాలన్నీ పటాపంచలు చేస్తూ.. జగన్ దగ్గర విక్రమ్ అభ్యర్థిత్వాన్ని తెలియజేసి నియోజకవర్గంలో ప్రజలతో పాటు జిల్లాలో మరోసారి మేకపాటి ముద్ర పడేలా చేశారు మాజీ ఎంపీ రాజమోహన్ రెడ్డి. తన వారసుడు ఎవరనే ఇంతకాలం వచ్చిన అనుమానాలపై క్లారిటీ వచ్చేలా మేకపాటి వారసుడు విక్రమ్ అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు.మేకపాటి కుటుంబంలో రాజకీయ వారసుడొచ్చాడు సరే.. మాజీ మంత్రి గౌతమ్ రెడ్డి ఆశయాలు, తండ్రి రాజమోహన్ రెడ్డి కలను విక్రమ్ రెడ్డి నెరవేరుస్తాడా? అనేదే ప్రస్తుతం తెరమీదకి వస్తున్న ప్రశ్న. విక్రమ్ రెడ్డి గత 30 సంవత్సరాలుగా ఏనాడూ బయటకురాని వ్యక్తి, తండ్రి, రాజమోహన్ రెడ్డి, అయిదుసార్లు ఎంపీ అయినా.. చిన్నాన్న మేకపాటి చంద్రశేఖరరెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యే అయినా.. అన్న గౌతమ్ రెడ్డి మంత్రి అయినా విక్రమ్ రెడ్డి రాజకీయాల వైపు ఎనాడూ కన్నెత్తి కూడా చూడలేదు. రాజకీయంగా ఓనమాలు తెలియని వ్యాపారవేత్త విక్రమ్ రెడ్డి. అనుకోకుండా రాజకీయ అరంగేట్రం చెయ్యడంతో కార్యకర్తల్లో తెలియని ఏదో ఆందోళన ఒక వైపు వెంటాడుతోందట. విక్రమ్ రెడ్డి అందరినీ గుర్తుపట్టి గుర్తింపు ఇచ్చేలోపే మిగిలిన రెండేళ్ల పుణ్యకాలం కాస్తా పూర్తవుతుందనే భయం పార్టీ శ్రేణుల్లో మరోవైపు వెంటాడుతోందట.అన్న గౌతమ్ రెడ్డి మూడేళ్లు మంత్రిగా ఉన్నప్పుడే నెల్లూరు ప్రాంతానికి ఏమీ చేయకపోగా కార్యకర్తలను పట్టించుకున్న పాపాన పోలేదట. మంత్రిగా ఉండి ఏమీ చేయలేని గౌతమ్ రెడ్డి.. ఇప్పుడు ఆయన తమ్ముడు విక్రమ్ ఎమ్మెల్యే అయి ఏంచేస్తాడని శ్రేణులు అనుమానాలు వ్యకత్ం చేస్తున్నారట. ఈ మధ్య కాలంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం బ్యారేజీని పరిశీలించడానికి కొత్త మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెళ్లారు. అయితే అక్కడ కాకాణికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మాజీ మంత్రి గౌతమ్ రెడ్డి బొమ్మ కూడా అక్కడి నాయకులు వేయకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సంగం బ్యారేజికి మేకపాటి గౌతమ్ పేరు పెట్టాలని స్వయానా ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. ఇప్పుడు సంగం బ్యారేజి ప్రాంతానికి మంత్రి కాకాణి వెళితే అక్కడ గౌతమ్ రెడ్డికి వైసీపీ నేతలు ప్రాధాన్యం ఇవ్వలేదనే పలువురు ఎత్తిచూపుతున్నారు. దీన్ని బట్టి ఆ నియోజకవర్గంలో మేకపాటి కుటుంబం గ్రాఫ్ పడిపోతోందని అర్థమవుతుందంటున్నారు.ఉప ఎన్నికల్లో సాధారణంగా కొంత సింపతీ ఉంటుంది. ప్రస్తుతం ఆత్మకూరులో ఉన్న పరిస్థితి రీత్యా ప్రధాన ప్రతిపక్షం పోటీ పెడితే మేకపాటి విక్రమ్ ఎన్నికల్లో చాలా ఇబ్బందులు ఫేస్ చేయాల్సి వచ్చేదని వైసీపీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. చనిపోయిన కుటుంబంలో ఎవరైనా ఎమ్మెల్యే గా పోటీ చేస్తే టీడీపీ అక్కడ పోటీ చేయదని చంద్రబాబు గతంలోనే ప్రకటించారు. ఈ సాంప్రదాయం మంచిదని,

అది తెలుగు దేశం పార్టీ పాటిస్తుందని చెప్పారు బాబుగారు. అందులో భాగంగానే కడప జిల్లా బద్వేలు ఉప ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయని వైనం ప్రస్తావించదగ్గ అంశం. జనసేన మద్దతుతో బీజేపీ పోటీ చేసినా దానికి డిపాజిట్ గల్లంతయిన విషయం తెలిసిందే. అయితే.. ఆత్మకూరులో టీడీపీ పోటీ చేస్తే పరిస్థితులు తారుమారవుతాయనే చర్చ జరుగుతోంది.ఆత్మకూరు ఉప ఎన్నికలో బీజేపీ పోటీ పెట్టినా ఓ మోస్తరు ఓట్లు మాత్రమే దానికి పడతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే కార్యకర్తల పరిచయ కార్యక్రమం మొదలెట్టిన విక్రం రాబోయే రోజుల్లో ఈ అనుమానాలన్నీ పటాపంచలు చేసి, మేకపాటి అసలు సిసలు వారసుడు వచ్చాడు అనిపిస్తాడా..! లేక ఒక వ్యాపారిలా వ్యవహరించి మేకపాటి కుటుంబాన్ని రాజకీయంగా ఇరుకున పెడతారో తేలాలంటే కొంతకాలం వేచి చూడక తప్పదు.

## విజయవాడలో గంజాయి బ్యాచ్ వీరంగం

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ టూటౌన్ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టించింది. లంబాడిపేట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి సమయంలో ఐదు బైక్లను తగలబెట్టారు.నగర శివారు ప్రాంతం కావడంతో ఇక్కడ నిత్యం గంజాయి మత్తులో కొందరు యువకులు అల్లర్లకు పాల్పడతారని సమాచారం. గంజాయి విషయాన్ని పోలీసులకు తాము చెబుతున్నట్లు అనుమానించే దుండగులు బైక్లను తగులబెట్టినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ కొత్తపేట పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర్ జిల్లా బైక్ ల దొంగలు అరెస్ట్

**జల్సాల కోసం చోరీలు ..**

**నిర్జన ప్రదేశాలలో పార్కింగ్ చేసిన మోటర్ సైకిల్లే టార్గెట్...**

**ముగ్గురు నిందితుల అరెస్ట్.....15 బైక్ ల స్వాధీనం...**

రామగుండం ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో పెద్దపల్లి డిసిపి రవీందర్, గోదావరిఖని ఎసిపి గిరి ప్రసాద్ ,అధికారులతో కలిసి పత్రిక సమావేశం ఏర్పాటు చేసి బైక్ ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. గత నెల రోజుల నుండి ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ లు చోరికి గురి అవుతుండడం తో, ఉన్నత అధికారుల ఆదేశాల మేడిపల్లి చౌరస్తా లో, ఎన్టీపీసీ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు మోటార్ సైకిల్స్ పై వస్తూ పోలీస్ వారిని చూసి అనుమానాస్పదంగా పారిపోతుండగా, పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకున్నారు. వారు వాహనాలను దొంగిలించినట్లుగా నిర్ధారించారు. వెంటనే వారిని అదుపులో కి తీసుకున్ఆరు. దొంగతనాలకు పాల్పడుతూ దొంగిలించిన వాహనాలను బయ్యపు దామోదర్ రెడ్డి ద్వారా అమ్మి వచ్చిన డబ్బుల తో జల్సాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## శుక్రవారం నాడుసీఎం కోనసీమ పర్యటన

**ఐ పోలవరం మండలం మురమళ్ళలో వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమం**

అమరావతి శుక్రవారం నాడు కోనసీమ జిల్లాలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటిస్తారు. ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 10.20 గంటలకు ఐ పోలవరం మండలం కొమరగిరి చేరుకుంటారు. 10.45 గంటలకు మురమళ్ళ వేదిక వద్దకు చేరుకుని వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు, అనంతరం ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు మురమళ్ళ నుంచి బయలుదేరి 1.20 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

## పెళ్లింట విషాదం

**పెళ్లి పీటలపైనే వధువు మృతి**

విశాఖపట్నం విశాఖ మధురవాడలో పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. పెళ్లి పీటలపైనే వధువు చనిపోయిన ఘటన అందరినీ కలిచివేసింది. ముహూర్త సమయానికి జీలకర్రా బెల్లం పెడుతున్న సమయంలో వధువు సృజన స్పృహ కోల్పోయింది.. దీంతో వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సృజన మృతి చెందింది. అలసట కారణంగా సృజనకు గుండెపోటు వచ్చినట్లు భావిస్తున్నారు. పెళ్లి పీటలపైనే వధువు చనిపోవడంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు.

## మినీ మహానాడు కు ఏర్పాట్లు

విశాఖపట్నం రాష్ట్రం తిరిగి అభివృద్ధి పట్టాలెక్కాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు.విశాఖ జిల్లా కార్యాలయంలో ప్రవాస భారతీయుల మినీమహానాడు కోసం రూపొందించిన పార్టీ పాటల క్యాసెట్ను మరో ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా నిర్వహించే మినీ మహానాడును ఘనంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ప్రవాసాంధ్రుల్లో స్ఫూర్తి నింపే పాటలు ఇందులో ఉన్నాయన్నారు. నలభై దేశాలలో ఉన్న పార్టీ ప్రవాసాంధ్రుల కోసం ఈ మినీ మహానాడు జరుగుతుందని, ఇందుకోసం ఎన్ఆర్ఐలు ఎంతో ఉత్సాహంతో ఎదురు చూస్తున్నారని చెప్పారు. మే 14న దక్షిణాఫ్రికా, 20, 21 తేదీల్లో అమెరికాలోని బోస్టన్ నగరంలో జరిగే మినీ మహానాడుల్లో తాను పాల్గొననున్నట్లు శిరీష తెలిపారు. ఎన్ఆర్ఐలకు సభ్యత్వం, జన్మభూమి అభివృద్ధి కోసం వారి సూచనలు, సలహాలు స్వీకరించడం ఈ మినీమహానాడు ఉద్దేశమని చెప్పారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలు

పెనుగొండ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ నగరేశ్వరి మహిషాసుర మర్ధిని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో లో వాసవి జయంతి వేడుకలు ఘనంగా ముగిశాయి.. అమ్మవారికి పంచామృత అభిషేకాలు అర్చనలు ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు.. కర్ణాటక ,కేరళ కోయంబత్తూర్ జిల్లా నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెనుగొండ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 102 రకాల స్వీట్లను అమ్మవారికి సమర్పించారు ..ఈ కార్యక్రమంలో భాగంగా వాసవి అమ్మవారు మేళతాళాలతో, కాళికామాత నృత్యాలతో వెండి రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.. అమ్మ వారి రథోత్సవం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిశ్రద్ధలను చాటుకొన్నారు

## ప్రొద్దుటూరు అత్యాచార కేసులో నలుగురు అరెస్టు

కడప ప్రొద్దుటూరు అత్యాచార కేసుపై జిల్లా ఎస్పీ అన్బు రాజన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఎస్పీ మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేశాం. అంగన్వాడీ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసాం. వెంటనే ప్రొద్దుటూరు పోలీసులు స్పందించి కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేయలేదని మీడియా లో వచ్చిన వార్తలు అవాస్తవం.

ఈ నెల 8 వ తేదీన ప్రొద్దుటూరు రురల్ పోలీసులు బాలికను డాడి హోమ్ కు తరలించి విచారణ మొదలు పెట్టారు. బాలిక వద్ద 164 స్టేట్ మెంట్ నమోదు చేయడానికి ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పెట్టనున్నాము. మతిస్థిమితం లేక బిక్ష మెత్తుకునే బాలికను మాయమాటలు చెప్పి మోసం చేశారని అన్నారు.ఇంట్లో పని కోసం అని తీసుకు వెళ్లి బాలికను అత్యాచారం చేసిన వ్యక్తి ని కూడా అరెస్టు చేశాం. ఆమె ప్రియుడు అని చెబుతున్న శంభు ను కూడా అరెస్టు చేశాం. కేసునమోదు చేయడం లో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు అని వచ్చిన వార్తల్లో వాస్తవం లేదు. నిందితులపై పోక్సో యాక్ట్ క్రింద కేసులు నమోదు చేసాం. మహిళలు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# భయపెడుతున్న వరుస హత్యలు

హైదరాబాద్, మే 12, (న్యూస్ పల్స్)శాంతి భద్రతల్లో దేశంలోనే అత్యంత సేఫ్ అండ్ సెక్యూర్ సిటీగా పేరు ప్రతిష్టలను మన హైదరాబాద్ నగరం సంపాదించింది. మర్సర్ సర్వేలో సైతం ప్రపంచంలోనే 16వ స్థానం దక్కించుకుంది. తెలంగాణ సాధించిన అనంతరం పోలీసుల సంస్కరణలు, ప్రభుత్వ చర్యలు, పాలకుల ప్రత్యేక దృష్టితో శాంతిభద్రతల్లో ఎంతో మార్పు వచ్చిందని పోలీస్ బాస్లే స్వయంగా చెబుతున్నారు. కానీ, కొన్ని నెలలుగా నగరంలో చోటు చేసుకుంటున్న ఘటనలు నగరంలో మళ్లీ రౌడీల ఉనికిని వెల్లడిస్తున్నాయి. నగరంలోని సౌత్జోన్తోపాటు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్జోన్లోని కొన్ని పోలీస్స్టేషన్ల పరిధుల్లో చోటుచేసుకుంటున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల్లాంటి ఘటనలతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడిందినగరంలోని లంగర్హౌస్లో దారుణ హత్య జరిగింది. యువకుడిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. పిల్లర్ నెంబర్ 96 వై ఫైబర్ సర్కిల్ ఎదురుగా..కత్తులతో అతికిరాతకంగా హత్య చేశారు. నడిరోడ్డు మీద పడివున్న యువకుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని పరిస్థితులను పరిశీలించారు. పాత కక్షల కారణంగా హత్య జరిగిందా లేక ఇతర కారణాలవల్ల జరిగిందా అనేదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గ్యాంగ్ గా ఏర్పడి పక్కా స్కెచ్ తో హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్యపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సివకాగా .. లాలాగూడ, బంజారాహిల్స్ .. మంగళ, బుధ వారాల్లో ఇద్దరు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. సికింద్రాబాద్ లాలాగూడలో బోరబండకు చెందిన అఫ్సర్ అనే వ్యక్తిని మంగళవారం రాత్రి దుండగులు పొడిచి చంపారు. ఎక్కడో హత్యచేసి మృతదేహాన్ని లాలాగూడలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. 2017లో జరిగిన హత్యకేసులో అఫ్సర్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడని, ఇటీవలే జైలుకు వెళ్లివచ్చాడని తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే అతడిని చంపారని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని నీలోఫర్ కేఫ్ సమీపంలో మరో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బీరు బాటిల్తో కడుపులో పొడిచి ఓ..వ్యక్తిని హత్య చేశారు. స్నేహితులే ఈపని చేసారా? లేదా పాత కక్షల నేపథ్యంలో హత్య చేసి వుంటారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

## కడప నగరంలో సంచలనం సృష్టించిన బంగారు దుకాణం చోరీ కేసు



**5 గంటల్లో చేధించిన కడప వన్ టౌన్ పోలీసులు**

**రూ.1.2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు స్వాధీనం**

**బాలుపల్లి చెక్ పోస్టు వద్ద చోరీకి పాల్పడ్డ గుమస్తా ను అరెస్టు చేసిన పోలీసులు**

**యజమాని కి టోకరా వేసి.మారు తాళం తో భారీ చోరీ**

కడప మే 12 కడప నగరం వన్ టౌన్ పరిధిలోని మెహతాబ్ జ్యూవెలరీ షాప్ లో భారీ చోరీ కేసును, జిల్లా ఎస్.పి శ్రీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ నిరంతర పర్యవేక్షణలో, కడప ఆఖ బి.వెంకట శివారెడ్డి గారి ఆధ్వర్యం లో కడప వన్ టౌన్ పోలీసులు కేవలం 5 గంటల్లో చేధించారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ఉన్న పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్.పి శ్రీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ మీడియా కు వివరాలు వెల్లడించారు. చోరీ కి పాల్పడ్డ షేక్ మసూద్ (39) అనే గుమస్తాను అరెస్టు చేసి రూ.1.2 కోట్ల విలువైన 2.66 కిలోల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు, మూడు మారు తాళాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్.పి. శ్రీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ తెలిపారు. కేసువివరాలు:తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన గుమస్తా.. చోరీకి పక్కా స్కెచ్..మారు తాళాలు తయారీ: నగరం నక్ష్ కు చెందిన ముద్దాయి షేక్ మసూద్ గత 20 సంవత్సరాలు గా మెహతాబ్ జ్యూవెలరీ దుకాణంలో పనిచేస్తూ యజమాని మస్తాన్ వద్ద నమ్మకమైన వ్యక్తిగా గుర్తింపు పొందాడు.ఈ నేపథ్యంలో ఇటీవల షేక్ మసూద్ సమీప బంధువు కు పూచీకత్తుగా ఉంటూ ఇతరుల వద్ద అప్పు ఇప్పించాడు. సమీప బంధువు అప్పు చెల్లించకపోగా మసూద్ పై అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయసాగారు. అప్పుల బారి నుండి బయట పడేందుకు పక్కా ప్రణాళిక తో స్కెచ్ వేసాడు. ప్రతి రోజు ఉదయం యజమాని మస్తాన్ ఇంటివద్దకు వెళ్లి షాప్ తాళాలు తీసుకుని షాప్ ను తెరిచేవాడు. గుమస్తా మసూద్ వచ్చిన కొద్ది సేపటికి వంచని షాప్ కు వచ్చేవాడు. అదను చూసుకునిఅసలు తాళాలకు తానే స్వయంగా మారు తాళాలు తయారు చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు యజమాని మస్తాన్, నిందితుడు మసూద్ ఇద్దరు కలిసి షాప్ కు తాళాలు వేసుకుని భోజనానికి ఇంటికి వెళ్లారు. నిందితుడు కొద్ది సేపటికి మళ్ళీ తిరిగి దుకాణం వద్ద కు వెళ్లి మారు తాళాలతో షాపు షట్టర్లను తెరిచి ర్యాకుల్లో ఉంచిన 2.66 కిలోల బంగారు ఆభరణాలను, క్యాష్ బాక్స్ లో ఉంచిన రూ.45 వేల నగదును దొంగిలించి పరారయ్యాడు.యజమాని షేక్ మస్తాన్ 11 న మధ్యాహ్నం 3 గంటలకు భోజనానంతరం దుకాణం లోనికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే కడప వన్ టౌన్ సి.ఐ టి.వి సత్యనారాయణ కు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్.పి శ్రీ కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ కేసును ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసారు. అరెస్టు నేపథ్యం:నిందితుడు షేక్ మసూద్ బంగారు చోరీ చేసిన అనంతరం తిరుపతి కి వెళ్తున్నట్లు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలోరైల్వే కోడూరు సమీపంలోని బాలు పల్లి చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఆర్టీసీ బస్సు లో ఉన్న నిందితుడు మసూద్, అతని వద్ద ప్లాస్టిక్ సంచి లో ఉన్న 2668.75 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.45 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## నల్ల బజారులో స్టాంపులు...

**యథేచ్ఛగా విక్రయాలు**

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో నాన్ జ్యూడిషియల్ స్టాంపుల బ్లాక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో పెద్ద సంఖ్యలో వీటి విక్రయ దారులు అన్నింటినీ రెట్టింపు ధరలకు విక్రయిస్తూ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. ఆస్తుల క్రయ విక్రయాలు బ్యాంకులకు మార్టిగేజ్. దుకాణాల ఒప్పందాలకు. ఇతర ముఖ్య లావాదేవీలకు నాన్ జుడీషియల్ స్టాంపులు తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. ప్రతి రోజూ వందల సంఖ్యలో ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వాటిని కొనుగోలు చేస్తుంటారు. వాటిని విక్రయించే లైసెన్సు స్టాంపు వెండర్లు100 రూ. స్టాంపును రూ 150 కి. 10.రూ 30.కి. 20 స్టాంపు రూ 40.కి విక్రయిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే నీ ఇష్టం ఉంటే కొను లేకుంటే వెళ్లిపో అంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు అన్ని చోట్ల రెట్టింపు ధరలకు అమ్ముతున్నారని ప్రజల వాదనలు. అలాగే గడువు తీరిన పాత నాన్ జ్యూడిషియల్ స్టాంపులను కూడా అవసరాన్ని బట్టి వేళల్లో విక్రయాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇవే స్టాంపులు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటున్న సకాలంలో దొరక్క పోవడంతో ప్రజలు ఎక్కువ ధరలకు బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు

## రైలు టాయిలెట్ లో పసికందు

విశాఖపట్నం అమ్మ వెచ్చని స్పర్శలో హాయిగా నిద్రించాల్సిన ఆ పసికూన మరుగుదొడ్డిలో ఏడుస్తూ కనిపించింది.. తల్లిపాలు తాగుతూ ఆకలి తీర్చుకోవాల్సిన ఆ శిశువు మురుగు వాసనలో ఆకలితో తల్లడిల్లింది.. మాతృప్రేమలో మునిగితేలాల్సిన ఆ పసిపాప.. ఆమె ఎలా ఉంటుందో తెలియక అల్లాడిపోయింది. ఏ తల్లికి ఏ కష్టం వచ్చిందో.. లేక క్షణికావేశంలో చేసిన తప్పుకో ఆ బిడ్డను బలి చేసింది. పుట్టిన నిమిషాల వ్యవధిలోనే రైలు టాయిలెట్లో వదిలేసి తన దారిన తాను వెళ్లిపోయింది. ఏ పాపం తెలియని ఆ శిశువును ఈ లోకంలోకి తెచ్చి అనాథను చేసింది.ఓ వైపు తుపాను ప్రభావంతో భారీ వర్షం కురుస్తోంది. రైలులో అప్పుడే ఓ శిశువు జన్మించింది. తల్లి వెచ్చని పొత్తిళ్లలో ఆడుకోవాల్సిన పసికందును ఓ తల్లి రైలులోని మూత్రశాలలో వదిలేసి వెళ్లిపోయింది. ఈ అమానవీయ ఘటన విశాఖలో చోటు చేసుకుంది.విశాఖలో ధన్బాద్- అలెప్పి ఎక్స్ప్రెస్ రైలులో నవజాత శిశువును వదిలేసిన ఘటన కలకలం రేపింది. బి-1 బోగి టాయిలెట్ వాష్ బేసిన్లో మగ శిశువును ఓ తల్లి విడిచి వెళ్ళిపోయింది. శిశువు ఏడుపు వినిపించడంతో అక్కడే విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది కాపాడారు. మెరుగైన వైద్యం కోసం రైల్వే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శిశువుకు వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అప్పుడే పుట్టిన శిశువును ఎవరు విడిచి వెళ్ళారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్రం వర్సెస్ రాష్ట్రం

హైదరాబాద్, మే 12, )మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని 54,06,070 ఇండ్లకు స్వచ్ఛమైన జలాలు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక సమర్పించింది. మిగతా ఇది 98% అని రిపోర్టులో పేర్కొన్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83,03,612 ఇండ్లున్నాయని, 54,06,070 గృహాలంటే 98% ఇండ్లు కాదని కేంద్రం తప్పుపడుతున్నది. ఈ మేరకు థర్డ్ పార్టీ ఎంక్వైరీ కింద జల్ జీవన్ మిషన్ అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపింది. చాలా గ్రామాల్లో పాత ట్యాంకులకు రంగులు వేశారని, పాత పైప్ లైన్లనే వినియోగిస్తున్నారని పేర్కొంటూ అధికారులు కేంద్రానికి నివేదిక సమర్పించారు. ఇంతకు రాష్ట్రంలో ఉన్న కుటుంబాలెన్ని..? స్వచ్ఛ జలాలు అందుతున్నది ఎన్ని ఫ్యామిలీలకు అనేది ప్రశ్నార్థకంగా మారింది.మిషన్?భగీరథపై బల నిరూపణ మొదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకంపై యుద్ధానికి దిగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ఆధారంగా 98% ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చామని చెప్పడంతో కేంద్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జల జీవన్? మిషన్? అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి కీలక నివేదికను సమర్పించింది. నల్గొండ, సిద్దిపేట, నిర్మల్?, కామారెడ్డి, కరీంనగర్?, ఉమ్మడి మహబూబ్?నగర్?, వరంగల్?, రంగారెడ్డి జిల్లాల్లో ఈ బృందం ఫీల్డ్ విజిట్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టులో చాలా తప్పులున్నాయని రిపోర్ట్ లో పేర్కొన్నది.రూ.46 వేల కోట్లతో మిషన్? భగీరథ పథకాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదికల్లో వెల్లడించింది. రాష్ట్రంలోని 33 జిల్లాలను 26 సెగ్మెంట్లుగా విభజించి ఇప్పటి వరకు 69 ఇంటెక్ వెల్స్ ను, 113 వాటర్ ట్రీట్?మెంట్ ప్లాంట్లు, 1,708 మెయిన్? ట్యాంకులు, 35,260 విలేజ్ ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. మొత్తం కొత్తగా 1.50లక్షల కిలోమీటర్ల మేర పైపులైన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 98% ఇండ్లకు నల్లాలు బిగించారు. ఇంకా 2% మాత్రమే పని పెండింగ్? ఉంది. మిగిలిన 2 శాతం పనులను కంప్లీట్? చేసేందుకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం చేయాలి. ఇదీ రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదిక.కేంద్ర జల జీవన్? మిషన్? బృందం పలు అంశాలను వివరిస్తూ కేంద్రానికి నివేదించినట్లు అధికారులు చెప్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 83,03,612 ఇండ్లు ఉన్నట్లు గుర్తించింది. రాష్ట్ర ప్రణాళికా విభాగం గతేడాది రిపోర్టులో 89,49,169 ఇండ్లు ఉన్నట్లు తేల్చింది. రాష్ట్ర ప్రభుత్వం 54,06,070 ఇండ్లకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నట్లు నివేదికలో స్పష్టం చేసింది. ఈ లెక్కన 2011 జనాభా లెక్కల ప్రకారమే ఇంకా 28, 97, 542 ఇండ్లకు మిషన్ భగీరథ నీరు ఇవ్వడం లేదని కేంద్ర బృందం పేర్కొన్నది48 శాతం పాత పైపులైన్ల ద్వారానే మిషన్? భగీరథ నీటిని అందిస్తున్నారని, చాలాచోట్ల కాంట్రాక్టర్లు పనులు చేయకుండానే పాత లైన్లను చూపించి బిల్లులు తీసుకున్నారనే ఆరోపణలనూ కేంద్ర బృందం ప్రస్తావించింది.

## గంగమ్మకు సారె సమర్పించిన రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

తిరుపతి తిరుపతి తాతయ్య గుంట గంగమ్మకు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు సారె సమర్పించారు. అయనకు తుడా సర్కిల్ వద్ద ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి,ఆలయ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్,నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషా యాదవ్ లు స్వాగతం పలికారు. మంత్రి అంబటి రాంబాబు సారె తో ఆలయం వద్దకు చేరుకుని సారె సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకోవాలని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తిరుమల వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకుని ఆయన చెల్లి అయినటువంటి గంగమ్మకు సారె సమర్పించటం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.

# ఎన్నికల కోసమే గడప గడపకు నిరుద్యోగ యువతి యువకులు నిలదీయండి



## బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు షేక్ రియాజ్

నంద్యాల :- నంద్యాల జిల్లా కేంద్రంలో గురువారం నాడు ఓ ప్రకటనలో వంకిరి రామచంద్రుడు. షేక్ రియాజ్ మాట్లాడుతూ ఇది రాష్ట్ర ప్రభుత్వ గడప గడప ప్రోగ్రాం కాదు అడపదడప ప్రోగ్రాం అని విమర్శించారు. రానున్న ఎన్నికల్ల కోసమే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప, అడపదడప ప్రోగ్రాం అని అన్నారు. రాష్ట్రంలో ఎటువంటి జాబ్ నోటిఫికేషన్ లేకుండా నిరుద్యోగులను మోసం చేస్తు గడపగడపకు అంటూ వస్తున్న స్థానిక ఎమ్మెల్యే లను,ఎంపీలను, జిల్లా ఇంచార్జ్ లను ,మంత్రులను నిరుద్యోగ యువతి,యవకులు నిలదీయండి అని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గొప్పలు చెప్పుకుని సచివాలయ ఉద్యోగులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా నిరుద్యోగులను నట్టేట ముంచిన రాష్ట్ర ప్రభుత్వం అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యి మూడు సంవత్సరాలు అవుతున్న కూడా ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా కేవలం కాలయాపన చేస్తోందని, రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగులను మోసం చేయాలని ఉద్దేశంతోనే నిరుద్యోగులకు అర్హత కన్నా ఎక్కువగా సచివాలయం పోస్టులు రిలీజ్ చేసి ఇంత వరకు వారి పోస్టులు రెగ్యులర్ చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీ నాయకులు గడప గడప అడపాదడపా ప్రోగ్రాం లో నిరుద్యోగ యువకులు యువతులు జాబ్ క్యాలెండర్ కోసం వారిని ప్రశ్నించాలని, కేవలం రాజకీయ నాయకులు యువతను మోసం చేసే విధంగా వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం తయారయిందని,వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, నిరుద్యోగులను మోసం చేస్తూ సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని మోసం చేస్తూ, గడప గడప, అడపా దడపా ప్రోగ్రామ్ తో ముందుకు వస్తున్న స్థానిక ఎమ్మెల్యే మరియు ఎంపీల పోగ్రాంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు

## వివాహ వేడుకల్లో గుంతకల్ ఎమ్మెల్యే వెంకట్రామి రెడ్డి

తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో గల కాశిరెడ్డి నాయన దేవస్థానం నందు గురువారం రోజున నిర్వహించిన రాంపల్లి డీలర్ సోమశేఖర్ రెడ్డి కుమార్తె వివాహానికి గుంతకల్లు ఎమ్మెల్యే వెంకట్రామి రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం కాశిరెడ్డి నాయన దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. వివాహానికి హాజరైన ఎమ్మెల్యే కు వైసిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బసిరెడ్డి,ఈశ్వర్ రెడ్డి,మామిళ్లకుంట డీలర్ తిమ్మప్ప,ప్రతాప రెడ్డి,మండల పరిధిలోని గల డీలర్లు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.



# మే 17 నుంచి కేతంరెడ్డి వినోద్ రెడ్డి పవనన్న ప్రజా బాట



నెల్లూరు జనసేన పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక డి.ఆర్.ఉత్తమ హోటల్ లో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఈ నెల 17 నుండి కేతంరెడ్డి వినోద్ రెడ్డి చేపట్టబోయే పవనన్న ప్రజాబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లాలోని పార్టీ నియోజకవర్గాల ఇన్ ఛార్జ్ లు, నెల్లూరు సిటీ నాయకులు, వీర మహిళలు, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ ఓ సాధారణ కానిస్టేబుల్ కొడుకుగా పుట్టి సామాన్య మధ్య తరగతి నేపథ్యం కల్గిన తాను చదువుకునే రోజుల నుండి రాజకీయాలపై ఆసక్తితో విద్యార్థి దశ నుండే ప్రజా పోరాటాల్లో భాగమయ్యానని అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీలో ఎన్.ఎస్.యూ.ఐ కార్యకర్త స్థాయి నుండి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాయి వరకు పని చేసే అవకాశం తనకు లభించిందని గుర్తు చేసారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ నుండి బయటికొచ్చిన తాను సేవ్ నెల్లూరు పేరుతొ పన్నుల పోటుపై ప్రజా పోరు బాట నిర్వహించి నెల్లూరు నగర ప్రజలకు అండగా నిలవడం జరిగిందన్నారు. ఆ పోరాట పటిమను గుర్తించే జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు తన నుండి ఏమీ ఆశించకుండా నిజాయతీగా, నిస్వార్థంతో ఒక సామాన్యుడైన తనకు రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారని అన్నారు. బీఫారం ఇచ్చే సమయంలో ఎంతో నమ్మకంతో సీటు ఇస్తున్నాను వినోద్, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకంటూ పవన్ కళ్యాణ్ అన్నారని గుర్తుచేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచిన పవన్ కళ్యాణ్ గారి ఋణం తీర్చుకోలేనిదని అన్నారు. ఎన్నికలు అయిన తర్వాత జరిగిన సమీక్షలో సైతం రాష్ట్రంలో ఎక్కువగా డబ్బు ప్రవహించిన నియోజకవర్గాలు ఒకటి నాది అయితే రెండోది నీది అని తనతో పవన్ కళ్యాణ్ అన్నారని గుర్తు చేశారు. అంతటి డబ్బు ప్రవాహంలో కూడా తనకు ఐదున్నర వేలకు పైగా ఓట్లు వచ్చాయంటే ఆనాడు పడిన ప్రతి ఓటు పవన్ కళ్యాణ్ గారికే అని అన్నారు. 2019 ఎన్నికలు అయిన నాటి నుండి ఈ మూడేళ్ళలో పార్టీలో తనకు పూర్తి స్వేచ్ఛని ఇచ్చారని, పవన్ కళ్యాణ్ గారి నమ్మకాన్ని రెట్టింపు చేస్తూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్నామన్నారు.అనేక సందర్భాల్లో ప్రజలకు అండగా నిలబడ్డామని తెలిపారు. పవన్ కళ్యాణ్ గారు నెల్లూరుకు వచ్చిన సందర్భంలో “వినోద్.. పోరాడుతాడు.. ప్రశ్నిస్తాడు.. నిలబడాలి ఇలాంటోళ్ళు” అని తనని ఉద్దేశించి అన్నారని, ఎంతో నీతి నిజాయితీ కల్గిన నాయకుని మనసుకు నచ్చేలా ప్రజా సమస్యలపై పోరాడటం గర్వంగా ఉందని తెలిపారు. ఆ పోరాట స్ఫూర్తితోనే ఈ నెల 17న నెల్లూరు సిటీ 3వ డివిజన్ నుండి పవనన్న ప్రజాబాట పేరుతో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజా సమస్యల అధ్యయనం చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు తెలిపి పవన్ కళ్యాణ్ ను ఎందుకు ముఖ్యమంత్రిగా చేసుకోవాలో తెలుపుతామన్నారు. మూడేళ్ళ వైసిపీ పాలనలో నెల్లూరు సిటీలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, కోవిడ్ సమయంలో వ్యాపారస్తులపై బెదిరింపులు, ప్రభుత్వ ఉద్యోగులను, కార్మికులను మోసగించిన వైనం గుర్తుచేస్తామన్నారు. మూడేళ్ళు మంత్రిగా ఉండి కూడా నెల్లూరు సిటీలో ప్రజలకు గుర్తుండేలా కనీసం ఒక్కటంటే ఒక్క పని కూడా చేయని ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ ఏ ముఖం పెట్టుకుని గడప గడపకు తిరుగుతారని, పవనన్న ప్రజాబాటతో ఆ గడప గడప దగ్గరే అనిల్ అసమర్థత తెలియజేస్తామని ఎద్దేవా చేసారు. జిల్లాలో కొందరు అధికారులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని, ప్రతి ఒక్కరి పేరుని వ్రాసుకుంటున్నామని, 2024లో సీఎం అయ్యేది పవన్ కళ్యాణే అని, అధికారంలోకి రాబోయేది తామేనని, ఏ ఒక్క అధికారిని కూడా ఊరికే వదిలిపెట్టమని కేతంరెడ్డి వినోద్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఆత్మకూరు ఇన్ ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్, సూళ్లూరుపేట ఇన్ ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్, జిల్లా నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్ రెడ్డి, ఏటూరి రవి, కారంపూడి కృష్ణారెడ్డి, కాకు మురళీరెడ్డి, మేకల ప్రవీణ్ యాదవ్, ఆమంచర్ల శ్రీకాంత్, జీవన్, హేమంత్ రాయల్, జఫర్, కుక్క ప్రభాకర్, రేవంత్ వీరమహిళలు షేక్ ఆలియా, శిరీషారెడ్డి, సునంద, కుసుమ, ఝాన్సీ పార్టీ తరపున పోటీ చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలు పరిశీలన

బద్వేలు గోపవరం మండలం లో ఆసానీ తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన వరి,పత్తి మరియు నువ్వుల పంటలు 25 ఏకరాల మేర దెబ్బతిన్నట్లు గా ప్రాథమిక అంచనా ప్రభుత్వానికి మండల వ్యవసాయ అధికారి వారు నిషేధించడం జరిగింది. క్షేత్రస్థాయిలో బేతపల్లి కాల్వపల్లి ఇతర గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటను కాపాడుకునేందుకు రైతులు పొలాల్లో నిలబడి ఉన్నా నీళ్లను బయటకు పంపేలా ఏర్పాటు చేసుకోవాలని, తదుపరి పది గ్రాముల 13- 0- 45 ఎరువుల్ని పిచికారి చేసుకోవాలి అదేవిధంగా వరి పంటకు 5% ద్రావణాన్ని పిచికారీ చేసుకున్న ఎడల విత్తనాలు మొలకెత్తకుండా కాపాడుకోవచ్చునని కనుక క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ ఈ విషయాన్ని గ్రామ రైతులకు వాలంటీర్ల ద్వారా మరి ఇతర మాధ్యమాల ద్వారా తెలియజేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు తీవ్ర సిబ్బంది పాల్గొన్నారు



# డబ్బున్న వాడికి ఫన్.. లేని వాడికి ఫస్ట్రేషన్..!




విక్టరీ వెంకటేష్ - మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోలుగా నటించిన తాజా చిత్రం “ఎఫ్ 3”. బ్లాక్ బస్టర్ ఫిలిం మేకర్ అనిల్ రావిపూడి ఈ సినిమాని తెరకెక్కించారు. ఇది 2019లో ఘనవిజయం సాధించిన ‘ఎఫ్ 2’ ఫన్ ఫ్రాంచైజీలో రూపొందించిన మూవీ. సమ్మర్ స్పెషల్ గా మే 27న ఈ వినోదాత్మక చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.ఇప్పటికే విడుదలైన “ఎఫ్ 3” ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. 2 నిమిషాల 32 సెకన్ల నిడివి గల ఈ ట్రైలర్ అపరిమితమైన వినోదాన్ని అందిస్తోంది. ‘ఎఫ్ 2’ లో క్యారెక్టరైజేషన్లతో కొత్త కథతో ఈ సినిమా తెరకెక్కిందని అర్థం అవుతుంది. అక్కడ భార్యాభర్తల కథకు ఫన్ - ఫ్రస్టేషన్ కలిపి చూపిస్తే.. ఈ3 కథ అంతా డబ్బు చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది.అనిల్ రావిపూడి తనదైన రైటింగ్ అండ్ టేకింగ్ తో దీన్ని అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గా రూపొందించారని ట్రైలర్ సూచిస్తుంది. నటీనటులు మరియు సాంకేతిక నిపుణులందరూ కంటెంట్ ని తదుపరి స్థాయికి తీసుకెళ్లారు. ఇందులో వెంకటేష్ రేచీకటి బాధితుడిగా.. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నత్తితో మాట్లాడే యువకుడిగా కనిపించి ఆద్యంతం నవ్వులు పూయించారు.తమన్నా భాటియా మరియు మెహ్రీన్ ఇద్దరూ ట్రెడిషనల్ అండ్ గ్లామర్ అవతార్ లలో అద్భుతంగా కనిపిస్తారు. ఇందులో సోనాల్ చౌహాన్ - సునీల్ కీలక పాత్రల్లో కనిపించగా.. వెన్నెల కిషోర్ పాన్ ఇండియా జూనియర్ ఆర్టిస్టుగా అలరించాడు. రాజేంద్ర ప్రసాద్ - మురళీ శర్మ - రఘుబాబు - శ్రీకాంత్ అయ్యంగార్ - పృథ్వీరాజ్ - ప్రగతి వంటి భారీ తారాగణం ఇందులో కనిపించారు.మధ్యతరగతి ప్రజల గొప్ప కలలను ప్రామాణికంగా హాస్యభరితంగా “ఎఫ్ 3” చిత్రాన్ని తీర్చిదిద్దారని తెలుస్తోంది. ఫన్ ఎంటర్టైనర్లను హ్యాండిల్ చేయడంలో అనిల్ రావిపూడి మరోసారి తన నైపుణ్యాన్ని చూపించాడు. వెంకీ మరియు వరుణ్ లను హైలెరియస్ రోల్స్ లో ప్రెజెంట్ చేశారు. ఇందులో స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ఐటమ్ సాంగ్ లో కనిపించనుంది.

టెక్నికల్ టీమ్ వర్క్ విషయానికి వస్తే సాయి శ్రీరామ్ కెమెరా పనితనం డిఫరెంట్ గా ఉంది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన బ్యాక్గ్రౌండ్ స్కోర్ తో వినోదాన్ని పెంచాడు. మొత్తం మీద ఈ3 ట్రైలర్ అన్ని వినోదాత్మక అంశాలతో చాలా ఆహ్లాదకరంగా ఉంది. మే 27న సినిమా థియేటర్లలో నవ్వులు పూయింస్తుందని గ్యారెంటీ ఇస్తోంది.’ఎఫ్ 3’ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. హర్షిత్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేయగా.. తమ్మిరాజు ఎడిటింగ్ వర్క్ చేశారు. ఎస్ కృష్ణ స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గా వ్యవహరించగా.. ఆది నారాయణ - నారా ప్రవీణ్ అదనపు స్క్రీన్ ప్లే అందించారు.

# 'సోల్ ఆఫ్ వెన్నెల'.. ఆమెది చరిత్రలో నిలిచిపోయే ప్రేమ..!

హాండ్సమ్ హంక్ రానా దగ్గుబాటి - సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం “విరాట పర్వం”. వేణు ఊడుగుల దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. అప్పుడెప్పుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. కరోనా పాండమిక్ నేపథ్యంలో విడుదలకు నోచుకోలేదు. అయితే ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ఇటీవలే ప్రకటించారు.’విరాటపర్వం’ మూవీని జూలై 1న గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నట్లు తెలిపారు. 1990లలో జరిగిన యదార్థ సంఘటనల ప్రేరణతో నక్సలిజం బ్యాక్ డ్రాప్ లో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలలో రానా - సాయి పల్లవి కనిపించనున్నారు.విప్లవకారుడు కామ్రేడ్ రవన్న అలియాస్ డాక్టర్ రవిశంకర్ పాత్రలో రానా.. అతని రచనలకు వీరాభిమాని అయిన వెన్నెల పాత్రలో సాయి పల్లవి నటించింది. ఇప్పటికే విడుదలైన ‘విరాటపర్వం’ ప్రచార చిత్రాలు - టీజర్ - ఫస్ట్ సింగిల్ ‘కోలు కోలు’ మరియు వాయిస్ ఆఫ్ రవన్న గ్లిమ్స్ కు మంచి రెస్పాన్స్ లభించింది.ఇవాళ హీరోయిన్ సాయి పల్లవి పుట్టినరోజు కావడంతో ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర బృందం ‘సోల్ ఆఫ్ వెన్నెల’ పేరుతో ఓ వీడియో రిలీజ్ చేశారు. ‘వెన్నెల రెండుసార్లు జన్మించింది. తొలిపొద్దులో ఇప్పపూలు పూసినట్టు అడవి తల్లి ఒడిలో ఒకసారి.. ఆశయాన్ని ఆయుధం చేసినట్టు అతని ప్రేమలో మరొకసారి’ అంటూ ఇందులో సాయి పల్లవి పాత్ర స్వభావం గురించి వివరించారు.’నిర్బంధాలు గౌగిలించుకున్న వసంతకాలం మనది.. రేపు మనమున్నా లేకపోయినా చరిత్ర ఉంటుంది.. మన ప్రేమను వినిపిస్తుంది’ అని పల్లవి చెప్పే డైలాగ్ ఆకట్టుకుంటోంది. ‘విరాటపర్వం’ సినిమా యుద్ధం నేపథ్యంలో సాగే ఓ అద్భుతమైన ప్రేమకథ అని తెలుస్తోంది.కెరీర్ ప్రారంభం నుంచీ ప్రాధాన్యత ఉన్న పాత్రలే చేస్తూ వస్తోన్న సాయి పల్లవి.. ‘విరాటపర్వం’ చిత్రంతో మరోసారి తన సహజమైన నటనతో మెస్మరైజ్ చేయబోతోందని ఈ వీడియో చూస్తే అర్థం అవుతుంది. సోల్ ఆఫ్ వెన్నెలకు బ్యాగ్రౌండ్ స్కోర్ మరియు విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.దగ్గుబాటి సురేష్ బాబు సమర్పణలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో ప్రియమణి - నందితా దాస్ - నవీన్ చంద్ర-జరీనావహాబ్-ఈశ్వరీ రావు - సాయి చంద్ బెనర్జీ -నాగినీడు- రాహుల్ రామకృష్ణ - దేవి ప్రసాద్ - ఆనంద్ రవి - ఆనంద్ చక్రపాణి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు.




# అఖిల్ మీదికి ఇంకో ఎటాక్

లేక లేక మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్తో ఒక హిట్టు కొట్టాడు అక్కినేని కుటుంబ యువ కథానాయకుడు అఖిల్. ఆ సినిమాకు కూడా ఫుల్ పాజిటివ్ టాక్ ఏమీ రాలేదు కానీ.. రిలీజ్ టైమింగ్ సహా అన్నీ కలిసొచ్చి ఆ సినిమా బాగానే ఆడింది. అఖిల్ పెర్ఫామెన్స్ విషయంలో అంత అప్లాజ్ ఏమీ రాకున్నా.. మూడు డిజాస్టర్ల తర్వాత మొత్తానికి అతడి ఖాతాలో తొలి హిట్ అయితే పడింది.ఈ ఊపులో ఒక భారీ చిత్రం చేస్తున్నాడతను. అదే.. ఏజెంట్. సురేందర్ రెడ్డి లాంటి టాప్ లీగ్ డైరెక్టర్ ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. అనిల్ సుంకర ఈ చిత్రం మీద దాదాపు రూ.50 కోట్ల బడ్జెట్ పెట్టేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇది కచ్చితంగా అఖిల్ మీద మోయలేని భారమే. కాకపోతే ఇటు ట్రేడ్లో అటు యూత్లో ఈ సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. ఐతే బాక్సాఫీస్ దగ్గర ఏజెంట్కు అంత అనుకూల పరిస్థితులైతే కనిపించడం లేదు.ఏజెంట్ మూవీ ఆగస్టు 12న విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఐతే ఆ వీకెండ్లో అంతకంతకూ ఏజెంట్కు పోటీ పెరిగిపోతోంది. ఆల్రెడీ నాగచైతన్య ప్రత్యేక పాత్ర పోషించిన బాలీవుడ్ మూవీ లాల్ సింగ్ చద్దా అదే వారాంతంలో విడుదల కాబోతోంది.చైతూ నటించడానికి తోడు ఇది ఆమిర్ ఖాన్ మూవీ కావడంతో దక్షిణాదిన మంచి అంచనాలతోనే విడుదల కానుంది. మరోవైపు సమంత సినిమా యశోద ఆగస్టు 12న నేరుగా అఖిల్ మూవీతో పోటీ పడబోతోంది. ఈ పోటీ చాలదన్నట్లు ఇప్పుడు ఇంకో ఆసక్తికర సినిమా ఆగస్టు 12 రేసులోకి వచ్చింది.అదే.. మాచర్ల నియోజకవర్గం. అఖిల్ను తన బేనర్ ద్వారా హీరోగా పరిచయం చేసి గట్టి ఎదురు దెబ్బ తిన్న నితిన్.. తన సొంత బేనర్లోనే చేసిన కొత్త సినిమాను నిజానికి ఈ చిత్రాన్ని జులై 8న రిలీజ్ చేయాలనుకున్నారు.కానీ ఆ టైంకి సినిమా రిలీజ్ చేయడం కష్టమనుకున్నారో ఏమో.. నెల రోజులకు పైగా వాయిదా వేసి ఆగస్టు 12కు ఫిక్స్ చేస్తున్నారు. ఇన్ని సినిమాల పోటీ మధ్య అఖిల్ మూవీ ఏమాత్రం నిలబడుతుందో చూడాలి.



# సౌతాఫ్రికాతో టీ20 సిరీస్.. భారత జట్టు ప్రకటనకు ముహూర్తం ఖరారు



ఐపీఎల్ 2022 సీజన్ ముగిసిన వెంటనే స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగబోయే టీ20 సిరీస్కు సంబంధించి భారత జట్టు ప్రకటనకు ముహూర్తం ఖరారైంది. ఈ సిరీస్ కోసం జట్టు ఎంపికపై ఇదివరకే కసరత్తు ప్రారంభించిన సెలెక్షన్ కమిటీ.. ఈ నెల 26న ప్రాబబుల్స్ జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ప్లేయర్ల ఎంపికపై చర్చించేందుకు చేతన్ శర్మ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఈ నెల 23న సమావేశం కానుంది. ఈ మీటింగ్కు కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా హాజరు కానున్నారు. వీరి అభిప్రాయం తీసుకున్న తరువాత ఆటగాళ్ల జాబితాపై తుది నిర్ణయం తీసుకునే అవ?కాశం ఉంది. స్వదేశంలో జరుగనున్న సిరీస్ కావడంతో కేవలం 15 మంది ఆటగాళ్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక జట్టులో ఎవరెవరికి స్థానం కల్పించబోతున్నారన్న అంశాన్ని పరిశీలిస్తే.. ఐపీఎల్కు ముందు శ్రీలంకతో ఆడిన జట్టునే దాదాపుగా ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఐపీఎల్ 2022 స్టార్లు హార్ధిక్ పాండ్యా, దినేశ్ కార్తీక్, ఉమ్రాన్ మాలిక్, తిలక్ వర్మ, రాహుల్ తెవాతియా, శివమ్ దూబె పేర్లను పరిశీలించే ఛాన్స్ ఉంది. మరోవైపు విరాట్ కోహ్లికి విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖరారైందని సమాచారం. ఇటీవల గాయపడిన రవీంద్ర జడేజా, ఫామ్లో లేని వెంకటేశ్ అయ్యర్, సంజూ శాంసన్లను తప్పించే అవకాశాలు లేకపోలేదు. కాగా, భారత్-సఫారి జట్ల మధ్య 5 మ్యాచ్ల టీ20 సిరీస్ జూన్ 9-20 వరకు జరుగనున్న విషయం తెలిసిందే. - తొలి టీ20 : జూన్ 9 (ఢిల్లీ) - రెండో టీ20 : జూన్ 12 (కటక్)- మూడో టీ20 : జూన్ 14 (వైజాగ్) - నాలుగో టీ20 : జూన్ 17 (రాజ్కోట్) - ఐదో టీ20 : జూన్ 19 (బెంగళూరు) భారత జట్టు (అంచనా)..రోహిత్ శర్మ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, దీపక్ హుడా, హార్ధిక్ పాండ్యా, దినేశ్ కార్తీక్, ఇషాన్ కిషన్, చహల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, భువనేశ్వర్, హర్షల్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**